



# విజయభాను







విశాఖపట్నం, బుధవారం 18-10-2023 VIJAYABHANU DAILY ★ VISAKHAPATNAM సంపుటి : 48 సంచిక : 34 పేజీలు : 08 వెల : 1 రూపాయి


## తిరుమల నవరాత్రి బ్రహ్మోత్సవాలు..

### సింహవాహనంపై శ్రీవారి వైభవం



తిరుమల: అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు శ్రీ వేంకటేశ్వర స్వామివారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవోపేతంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు మంగళవారం ఉదయం స్వామివారికి సింహ వాహనసేవ నిర్వహించారు. సింహ వాహనంపై స్వామివారి వైభవాన్ని చూసి భక్తులు పులకించిపోయారు. రాత్రి 7 గంటలకు శ్రీవారికి ముత్యపు పందిరి వాహనసేవ నిర్వహించనున్నారు.

**సింహ వాహనం - ధైర్య సిద్ధి**

దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ కోసం శ్రీవారు సింహ వాహనాన్ని అధిరోహించారు. సింహం పరాక్రమానికి, ధైర్యానికి, తేజస్సుకు, ఆధిపత్యానికి, మహాధ్వనికి సంకేతం. ఉదయం నిద్ర లేవగానే దర్శించే వస్తువుల్లో 'సింహదర్శనం' అతి ముఖ్యమైంది. సింహ రూప దర్శనంతో పైన పేర్కొన్న శక్తులన్నీ చైతన్యవంత మవుతాయి. సోమరితనం నశించి పట్టుదలతో ప్రవర్తించి విజయస్ఫూర్తి సిద్ధిస్తుంది.

## నిర్మలా సీతారామన్‌ను కలిసిన ఎంపీ విజయసాయిరెడ్డి



ఢిల్లీ: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి మంగళవారం కలిశారు. ఆంధ్రప్రదేశ్‌కి సంబంధించిన పలు అంశాలపై కేంద్రమంత్రితో చర్చించారు.

# 2040 నాటికి చంద్రుడిపైకి తొలి భారతీయుడు..

### గగన్‌యాన్ మిషన్‌పై మోదీ సమీక్ష - శాస్త్రవేత్తలకు మోదీ సూచన



ఢిల్లీ: చంద్రయాన్-3 చారిత్రక విజయం, ఆదిత్య-ఎల్ 1 ప్రయోగంతో అంతరిక్ష రంగంలో భారత ఖ్యాతి మరింత పెరిగింది. ఆ విజయ పరంపరను కొనసాగిస్తున్న రాబోయే 20 ఏళ్లకు మరిన్ని ప్రతిష్ఠాత్మక లక్ష్యాలను నిర్దేశించుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ శాస్త్రవేత్తలకు సూచించారు. మరో పదేళ్లలో భారత అంతరిక్ష కేంద్రం ఏర్పాటు, 2040 నాటికి చంద్రుడి పై తొలి భారతీయులడు అడుగుపెట్టేలా లక్ష్యం పెట్టుకోవాలని ప్రధాని దిశానిర్దేశం చేశారు. గగన్‌యాన్ మిషన్‌లో భాగంగా మొట్టమొదటి వెహికల్ డెవలప్‌మెంట్ ఫ్లైట్(టీవీ-డీ1) క్రూ ఎస్కేప్ సిస్టమ్‌ను అక్టోబరు 21న పరీక్షించనున్నారు. ఆ కార్యక్రమ సన్నద్ధత, ప్రయోగ ఏర్పాట్లపై ప్రధాని మోదీ నేతృత్వంలో మంగళవారం ఉన్నతస్థాయి సమీక్ష జరిగింది. ఈ సమావేశంలో భవిష్యత్ అంతరిక్ష పరిశోధనా ప్రయోగాలపై శాస్త్రవేత్తలకు ప్రధాని పలు సూచనలు చేశారు. శుక్రగ్రహంపై ఆర్బిటర్ మిషన్, అంగారకుడిపై ల్యాండర్ వంటి ప్రయోగాల దిశగా శాస్త్రవేత్తలు కృషి చేయాలన్నారు. "చంద్రయాన్-3, ఆదిత్య-ఎల్1 విజయా లు అందించిన ఉత్సాహంతో భారత్ ఇప్పుడు మరిన్ని కొత్త, ప్రతిష్ఠాత్మక లక్ష్యాలను నిర్దేశించుకోవాలి. 2035 నాటికి భారతీయ అంతరిక్ష కేంద్రం ఏర్పాటు, 2040 నాటికి చంద్రుడిపైకి తొలి భారతీయుడిని పంపించే విధంగా ప్రయోగాలు చేపట్టాలి" అని మోదీ శాస్త్రవేత్తలకు సూచించినట్లు ప్రధానమంత్రి కార్యాలయం వెల్లడించింది. 2025 నాటికి గగన్‌యాన్ లో మిషన్‌ను ప్రయోగిం చేందుకు ఏర్పాట్లు తరువాయి 2లో..



## జనసేన నేతల అత్యవసర భేటీ..

### ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై చర్చ

అమరావతి: జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆ పార్టీ పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ తో జనసేన పార్టీ కార్యాలయంలో అత్యవసరంగా భేటీ అయ్యారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో ప్రధానంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, వారాహి యాత్ర 5వ తరువాయి 2లో..

## రాష్ట్రపతి చేతులమీదుగా జాతీయ అవార్డు అందుకున్న అల్లు అర్జున్

- తొలి తెలుగు హీరోగా చరిత్ర సృష్టించిన బన్నీ..!
- ఢిల్లీలో 69వ జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రదానోత్సవం



ఢిల్లీ : 69వ నేషనల్ అవార్డుల వేడుక న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో అంగరంగ వైభవంగా జరుగుతుంది. ఇన్నాళ్లు అందని ద్రాక్షలాగా మారిపోయిన బెస్ట్ యాక్టర్ అవార్డును అల్లు అర్జున్ అందుకున్నాడు. దశాబ్దాల చరిత్ర కలిగిన తెలుగు సినిమాలో ఇప్పటివరకు మహామహులే సాధించలేని అరుదైన ఘనతను అల్లు అర్జున్ సాధించి సంచలనం సృష్టించాడు. ఇక అల్లు అర్జున్ అవార్డు తీసుకుంటున్న వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాను ఊపేస్తుంది. ఈ అవార్డు ఫంక్షన్‌లో ముందుగా నిర్మాత నవీన్ ఎర్నేని, దర్శకుడు బుచ్చిబాబు సనాలు ఉప్పెన సినిమాకు గానూ జాతీయ అవార్డులు అందుకున్నారు.

అనంతరం బెస్ట్ యాక్షన్ డైరెక్టర్‌గా కింగ్ సోలోమాన్ ఆర్ఆర్ఆర్ సినిమాకు అవార్డును అందుకున్నాడు. ఆ తర్వాత ఉత్తమ కొరియోగ్రాఫర్‌గా నాటు నాటు పాటకు ప్రేమ్ రక్షిత్, ఉత్తమ నేపథ్య సంగీత దర్శకుడిగా ఎమ్.ఎమ్. కీరవాణి(ఆర్ఆర్ఆర్), ఉత్తమ సింగర్‌గా కాల భైరవ(ఆర్ఆర్ఆర్), ఉత్తమ గేయ రచయితగా చంద్రబోస్(కొండపొలం), ఉత్తమ వీఎఫ్ఎక్స్‌కు గానూ శ్రీనివాస్ మోహన్(ఆర్ఆర్ఆర్) అవార్డులు అందుకున్నారు. అన్ని వర్గాలను అలరించిన వినోదాత్మక చిత్రంగా ఆర్ఆర్ఆర్‌కు గానూ రాజమౌళి 69వ నేషనల్ అవార్డును అందుకున్నాడు. ఇక ఉత్తమ సంగీత దర్శకుడిగా దేవి శ్రీ ప్రసాద్ పుష్ప సినిమాకు గానూ అవార్డును అందుకున్నాడు.

## స్వలింగ వివాహాల చట్టబద్ధతపై సుప్రీం రెడ్ సిగ్నల్

- స్వలింగ వివాహనికి చట్టబద్ధత కల్పించలేం
- స్వలింగ వివాహం చేసుకున్న వారిని దంపతులుగా గుర్తించం
- వివాహం చేసుకోవడం ప్రాథమిక హక్కు కాదు
- 3:2 మెజారిటీతో రాజ్యాంగ ధర్మాసనం తీర్పు



ఢిల్లీ: కొంతకాలంగా ఉత్కంఠ రేపుతోన్న స్వలింగ వివాహాల చట్టబద్ధతపై రెడ్ సిగ్నల్ ఇస్తూ సుప్రీంకోర్టు మంగళవారం తుది తీర్పు వెలువరించింది. స్వలింగ సంపర్కాలపై భిన్నాభిప్రాయాలున్నాయన్న సీజేఐ చంద్రచూడ్.. స్వలింగ వివాహనికి చట్టబద్దత కల్పించలేమని తెలిపారు. స్వలింగ వివాహం చేసుకున్న వారిని దంపతులుగా గుర్తించలేమని స్పష్టం చేశారు. వివాహం చేసుకోవడం ప్రాథమిక హక్కు కాదని తీర్పులో పేర్కొన్నారు. ఈ కేసుపై పార్లమెంటే నిర్ణయం తీసుకోవాలని తెలిపిన సీజేఐ.. అది న్యాయ సమీక్షకు లోబడి ఉండాలని తీర్పులో పేర్కొన్నారు. ఈ మేరకు 3:2 మెజారిటీతో రాజ్యాంగ ధర్మాసనం తీర్పు వెలువరించింది. 'స్వలింగ వివాహనికి చట్టబద్దత కల్పించలేం. స్వలింగ వివాహం చేసుకున్న వారిని దంపతులుగా గుర్తించం. వివాహం చేసుకోవడం ప్రాథమిక హక్కు కాదు. కలిసి జీవించడం గుర్తిస్తున్నాం.. కానీ దాన్ని వివాహంగా పరిగణించలేం. స్వలింగ సంపర్కులను దంపతులుగా గుర్తించలేము. స్వలింగ జంటల అభ్యర్థనల పట్ల సానుభూతి ఉంది కాని అభ్యర్థనలకు చట్టబద్ధత లేదు. ప్రత్యేక వివాహ చట్టం తరువాయి 2లో..






## చంద్రబాబు క్వాష్ పిటిషన్‌పై తీర్పు రిజర్వు



ఢిల్లీ: స్కిల్ డెవలప్‌మెంట్ కేసును కొట్టేయాలని కోరుతూ మాజీ సీఎం చంద్రబాబునాయుడు దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌పై తీర్పును సుప్రీంకోర్టు రిజర్వ్ చేసింది. జస్టిస్ అనిరుద్ధబోస్, జస్టిస్ బేలా ఎం.త్రివేదిలతో కూడిన ధర్మాసనం ఎదుట మంగళవారం పిటిషన్‌పై వాదనలు ముగిశాయి. ఏపీ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ, చంద్రబాబు తరఫున సీనియర్ న్యాయవాది హరీష్ సాల్వే వాదనలు వినిపించారు. ఇరువైపులా వాదనలు విన్న ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేసింది. "ఈ కేసులో 17ఏ సెక్షన్ వర్తించదు. పాత నేరాలకు సంబంధించి ఈ సెక్షన్ వర్తించదు. 17ఏ సెక్షన్ అధికారిక నిర్ణయాల సిఫార్సులకు మాత్రమే వర్తిస్తుంది. ఈ సెక్షన్ అవినీతిపరులకు రక్షణ ఛత్రం కాకూడదు. ప్రజా ప్రయోజనాల కోసం నిర్ణయాలు తీసుకునేవాళ్లు ఇబ్బందిపడకూడదనే ఈ చట్టం తీసుకొచ్చారు. ఈ కేసులో ఆరోపణలన్నీ ప్రత్యేక కోర్టు ద్వారా విచారించదగినవే" అని రోహత్గీ వాదించారు. రోహత్గీ వాదిస్తూ.. "అవినీతి నిరోధక చట్టం కింద కేసులు పెట్టినప్పుడు ఐపీసీ సెక్షన్ ప్రకారం కూడా విచారించే అధికారం ప్రత్యేక కోర్టులకు ఉంటుంది. అవినీతి కేసులను విచారించేందుకు ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేశారు. అవినీతి నిరోధం కోసం ముందస్తు చర్యలు చేపట్టాలి.. అందుకే ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేశారు. న్యాయపరిధికి సంబంధించి వివాదం లేదు.. ప్రత్యేక కోర్టుకు సంపూర్ణ న్యాయపరిధి ఉంది. రూ.వందల కోట్ల అవినీతి జరిగినట్టు ఆరోపణలు ఉన్నప్పుడు సెక్షన్ 422 సీఆర్‌పీసీ కింద క్వాష్ చేయలేం. ఆరోపణలు తరువాయి 2లో..

## విశాఖ జిల్లా అభివృద్ధికి అన్ని చర్యలు చేపట్టాలి

- విశాఖ జిల్లాను అన్ని హంగులతో సుందరంగా తీర్చిదిద్దాలి
- రాష్ట్ర మున్సిపల్ , పట్టణాభివృద్ధి శాఖా మంత్రి అదిమూలపు సురేష్



విశాఖపట్నం **(విజయభాను న్యూస్)** : విశాఖ జిల్లా అభివృద్ధికి అవసరమైన అన్ని రకాల చర్యలు చేపట్టాలని రాష్ట్ర మున్సిపల్ , పట్టణాభివృద్ధి శాఖా మంత్రి అదిమూలపు సురేష్ అధికారులకు సూచించారు. మంగళవారం ఉదయం విఎంఆర్డిఎ కార్యాలయంలో విఎంఆర్డిఎ ద్వారా విశాఖలో చేపట్టిన వివిధ ప్రాజెక్టులు, అభివృద్ధి పనుల ప్రగతికి సంబంధించిన అంశాలపై జిల్లా కలెక్టర్ డా ఏ మల్లికార్జున తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ విశాఖ నగరాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధికి అన్ని రకాల చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. విఎంఆర్డిఎ ద్వారా విశాఖలో చేపట్టిన వివిధ ప్రాజెక్టులు, అభివృద్ధి పనుల ప్రగతికి సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నగరంలో గుంతలు లేని రోడ్లు, పరిశుభ్రత, సుందరీకరణ పనులు వంటివి చేపట్టాలని అన్నారు . అదేవిధంగా వేస్ట్ మేనేజ్మెంట్ పనులు సవ్యంగా జరిగేటట్లు చూడాలని తెలిపారు. అమ్యూజ్మెంట్, థీమ్ పార్కుల ఏర్పాటు, ఎంటర్టైన్మెంట్ కార్యక్రమాల రూపకల్పన చేయాలన్నారు. టి20, తరువాయి 2లో..



రామాలయం - పరదేశమ్మ గుడి అమ్మవారి అన్నదానం కార్యక్రమం లో పాల్గొన్న ఎమ్మెల్యే వాసుపల్లి

విశాఖ దక్షిణ నియజకవర్గం పరిధిలో 27వార్డ్ దొండపర్తి ఏరియాలో శ్రీ రామాలయం-పరదేశమ్మ గుడి ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాల్లో అన్నదానం కార్యక్రమం లో ముఖ్య అధితిగా పాల్గొన్న విశాఖ దక్షిణ నియోజకవర్గం శాసన సభ్యులు వాసుపల్లి గణేష్ కుమార్ ఈ కార్యక్రమం లో 27వార్డ్ ప్రెసిడెంట్ నీలాపు సర్వేశ్వర రెడ్డి, ఆలయ చైర్మన్ సోము నాయుడు, అజయ్, ఆలయ పాలక వర్గ సభ్యులు, వందల సంఖ్య లో భక్తులు హాజరై అన్నప్రసాదాలు స్వీకరించారు.

# సోమాధుల కృపకు అధికారుల కృప చూపించాలి

**జిల్లా విజిలెన్స్ ఎండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఎం అప్పలరాజు, రేబాక మధుబాబు**



అనకాపల్లి జిల్లా చోడవరం : చోడవరం మండల కేంద్రంలో అనేక అనుమానాలకు తావిచ్చిన, ఒక మర్డరు కేసుగా భావిస్తున్న సంఘటనలో మృతుని తల్లి సోమాధుల కృపకు అధికారులు కృప చూపించాలని జిల్లా విజిలెన్స్ ఎండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఎం అప్పలరాజు, రేబాక మధుబాబు కోరారు. ఈ మేరకు తహసిల్దారు తిరుమల బాబుకు వినతి పత్రాన్ని సమర్పించారు. సోమాధుల కృప కుమారుడు మరణ విషయమై పోలీస్ అధికారులు బహిరంగంగా తాము వెల్లడిపరిచే అనుమానాలకు నివృత్తి చేయాలని ఇప్పటికే జిల్లా ఎస్పీని కలిసి కోరామన్నారు. ఈలోగా ఆమెకు పంచాయతీ కార్యాలయంలో తన విధులు యధావిధిగా నిర్వహించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని కోరామన్నారు తహసిల్దార్ వినతిపత్రం సమర్పించిన వారిలో కృపతో పాటు స్థానిక దళిత సంఘాల నాయకులు గుడబండి సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ మరిడిమాంబ అమ్మవారి వారాల పండుగ




భీమునిపట్నం : విజయభాను న్యూస్ నాగవంశీయుల ఆరాధ్య దైవం శ్రీ మరిడిమాంబ అమ్మవారి వారాల పండుగ మంగళవారం అమ్మవారి చదును పట్టు దగ్గర నుంచి అందరూ కలిసి అమ్మవారి తో కలిసి బయలుదేరి అమ్మవారి గుడి వద్దకు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి కి పసుపు కుంకుమలు మొక్కుబడులు సమర్పించారు ఈ కార్యక్రమంలో నాగవంశ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గాడు అప్పలనాయుడుఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాగవంశం సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు బొడ్డు అప్పల నాయుడు మొకర నీలకంఠం, కంట్టుభుక్త. ముత్యాలరావు , గాడు సన్యాసినాయుడు, ఎస్ జోగారావు, కనకాల సన్నిబాబు, రాంభుక్త ప్రభాకర్ నాయుడు,అప్పికొండ నర్సింగ్ రావు, కనకాల సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు

## రాజకీయ పార్టీ ల ప్రతినిధులతో సమావేశం

భీమునిపట్నం : విజయ భాను న్యూస్ భీమిలీ నియోజక వర్గం లో ప్రతి ఇంటి కి తిరిగి ఓటర్ల జాబితాల పరిశీలన అనంతరం సమగ్ర జాబితా రూపకల్పన చేపట్టి నట్లు ఓటర్ నమోదు అధికారి ఆర్డీవో ఎస్ భాస్కరరెడ్డి చెప్పారు. మంగళవారం వివిధ రాజకీయ పార్టీ ల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశం లో ఆయన మాట్లాడుతూ ఈ నెల 27 న ముసాయిదా ఓటర్ జాబితా ప్రకటించి రాజకీయ పార్టీల జిల్లా అధ్యక్షులకు అందిస్తామాన్నారు అభ్యంతరాలు స్వీకరించి ఈ. నెల 30 న మళ్ళీ పూర్తి స్థాయిలో సమీక్ష చేస్తామన్నారు జాబితాలో ఎవరైనా ఓట్లు లేవనీగుర్తించి నట్లయితే ఈ నెల 27 నుంచి డిసెంబర్ 9 వ తేదీ మధ్య మళ్ళీ ఓటర్ నమోదు కు ధర ఖాస్తు చేయ వచ్చాన్నారు ఈ కార్యక్రమంలో టి డీ పి నుంచి డి ఎ ఎన్ రాజు గంటా నూకరాజు యరభాల అనిల్ ప్రసాద్ వైకాపా నుంచి ఎస్ కరుణాకర్ రెడ్డి జీరు వెంకట రెడ్డి జనసేన నుంచి ఈ ఎన్ ఎస్ చంద్రరావు ఎన్నికల డిప్యూటీ తాసిల్దార్ జె భాస్కర రావు పాల్గొన్నారు

## ఉచిత యోగా శిక్షణా కార్యక్రమం

భీమునిపట్నం : విజయభానున్యూస్ ఓం ఉచిత యోగా సంస్థ అధ్యక్షులు చిలకా వెంకట రమేష్ ఆధ్వర్యంలో భీమిలీ మండలం లోని జి.తాళ్ళవలస లో ఉన్న బరోసా లిటిల్ హగ్స్ బాలల సంరక్షణ కేంద్రంలో ఉచితంగా యోగా శిక్షణ కార్యక్రమంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా నేర్చుకోవడం వలన మంచి ఆరోగ్యం క్రమశిక్షణ మనసు ప్రశాంతత పొందవచ్చని చెప్పారు. అనంతరం రమేష్ ని వెంపాడ వెల్ఫేర్ సొసైటి అధ్యక్షులు వెంపాడ శ్రీనివాసరెడ్డి , బరోసా లిటిల్ హగ్స్ బాలల సంరక్షణ కేంద్రం అధ్యక్షులు అత్తాడ అవినాష్ సన్మానం చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ యోగ శిక్షణ తరగతులు నిర్వహించడం ఎంతో మందికి స్ఫూర్తి దాయకమనీ అన్నారు.

## ఓటింగ్ యంత్రాల తనిఖీని పరిశీలన చేసిన కలెక్టర్

విశాఖపట్నం, విశాఖపట్నం **(విజయభాను న్యూస్)** : చినగదిలి ఈవీఎం గొడౌన్‌లో వున్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల మొదటి దశ తనిఖీలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా ఎ మల్లికార్జున మంగళవారం ఉదయం పోలీస్ కమీషనర్ ఏ. రవి శంకర్ , జివిఎంసి కమీషనర్ సాయి కాంత్ వర్మ ల తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పోలింగ్ స్టేషన్లకు సంబంధించి అవసరమైన ఈవీఎంలను సుమారు 30 రోజులపాటు రాజకీయ పార్టీల సమక్షంలో పూర్తిస్థాయిలో పరిశీలించనున్నట్లు వెల్లడించారు. ప్రతి యంత్రంలో ఓట్లు వేసి ఏదైనా సాంకేతిక లోపం ఉంటే వాటిని పక్కన పెట్టి, మిగిలిన వాటిని ఆమోదించే ప్రక్రియ అని వివరించారు. బెంగుళూరు నుంచి వచ్చిన బెల్ ఇంజినీర్ల నిర్వహణలో వెబ్ క్యాస్టింగ్, పటిష్టమైన పోలీసు బందోబస్తు మధ్య పక్రియ జరుగుతుందన్నారు. ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకూ జరిగే కార్యక్రమంలో ఆయా రాజకీయ పార్టీలు ప్రతినిధులు హాజరై ఈవీఎంల సాంకేతికతపై అనుమానాలు నివృత్తి చేసుకోవచ్చని చెప్పారు. ఈవీఎం కేంద్రంలో మొబైల్ ఫోన్లు నిషేధమని.. గుర్తింపు కార్డులు ఉన్న సిబ్బంది మాత్రమే పనిచేస్తారని, సీసీ కెమెరాల్లో పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు , ఎలక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

## హిందీ పరీక్షల ఫలితాలు విడుదల

రాజాం (విజయభాను న్యూస్) : దక్షిణ భారత హిందీ ప్రచార సభ (మద్రాస్) వారి హిందీ పరీలక్షల ఫలితాలు విడుదల అయ్యాయని హిందీ ప్రచారక్ కె మధుసూధనరావు మంగళవారం తెలిపారు. పరిచయ్, ప్రాదమిక, మధ్యమ, రాష్ట్రభాష,ప్రవేశిక వరకు గల ఈ పరీక్షలు ఆగస్ట్ నెలలో జరిగాయని అన్నారు. ఈ పరీక్ష ఫలితాలు కై విద్యార్థులు తమ 99499 17365 ఫోన్ నంబరును సంప్రదించాలని కోరారు.


## కంచరాంలో జగనన్న ఆరోగ్య సురక్ష



రాజాం (విజయభాను న్యూస్) : మండలంలో కంచరాం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు మంగళవారం ప్రారంభించారు. ప్రజలు ఈ సేవలు వినియోగించుకోవాలని సూచించారు. వైద్య శిబిరాలు వద్దకు చేరుకుని ఆరాతీశారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ ప్రతినిది లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ బండి నర్శింహులు, రాజాం పీఏసీఎస్ అధ్యక్షులు వాకముల్ల చిన్నంనాయుడు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, స్థానిక సర్పంచ్ గెడ్డాపు అప్పలనాయుడు, ఎంపీటీసీ రాంబాబు, ఎంపీడీఓ బాసూరీ శంకరరావు, ఈఓపీఆర్డీఓ శ్రీనివాసరావు, తహశీల్దార్ ఎస్కే రాజు, డాక్టర్లు నరేంద్ర, బార్గవ్, కళ్యాణబాబు తదితరులు పాల్గొన్నారు.



విశాఖ జిల్లా ఎస్సీ ఎస్టీ న్యాయవాదులు వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా జాయింట్ సెక్రెటరీగా ప్రముఖ న్యాయవాది ఎర్రశెట్టి శ్రీనివాసరావు ఎన్నుకోవాడం జరిగినది. ఆర్డర్ కాపీని ఎలక్షన్ ఆఫీసర్స్ దేశాఐ.హేమమాలిని. సత్య రావు చేతుల మీదుగా అందజేయడం జరిగింది.. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షురాలు పుష్ప కుమారి సెక్రెటరీ రాయి శ్రీను మరియు సీనియర్ న్యాయవాదులు సురేష్ చిన్నరావు పాక సత్యనారాయణ ప్రముఖ న్యాయవాదులు అభినందించడం జరిగింది.



నాగవంశీయులు మరింత వృద్ధిలోకి రావాలని,బీసీ కులాల్లో ఒకటైన నాగవంశీయులు ఉన్నతపదవులు అధిరోహించాలని నాగవంశీయుల ఇలవేల్పు శ్రీశ్రీశ్రీ మరిడింబ తల్లిని ప్రార్ధించినట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాగవంశం సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు బొడ్డు అప్పల నాయుడు తెలిపారు.) భీమిలిలో నిర్వహించిన నాగవంశం ఇలవేల్పు శ్రీశ్రీశ్రీ మరిడింబ తల్లి వారాలకు విశాఖ జిల్లా నాగవంశం మేరకు విచ్చేసిన అప్పలనాయుడు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు చేసారు.అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేసారు.వేలాదిగా భక్తులు మరిడింబ తల్లిని దర్శించుకుని తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు.ఈ సందర్భంగా భక్తులకు,నిర్వాహకులకు నాగవంశం కార్పొరేషన్ చైర్ పర్సన్ బొడ్డు అప్పలకొండమ్మ,అప్పలనాయుడు దంపతులు శుభాకాంక్షలు తెలిపారు

# 2040నాటికి చంద్రుడిపైకి తొలి భారతీయుడు..

జరుగుతున్నాయి. ఇందుకోసం 20 ప్రధాన పరీక్షలను నిర్వహించనున్నారు. మొట్టమొదటి క్రూ ఎస్కేప్ సిస్టమ్ పరీక్షను అక్టోబరు 21న చేపట్టనున్నారు. పరీక్షలో భాగంగా మాడ్యూల్‌ను అంతరిక్షంలోకి పంపడం, దానిని సముద్రంలో పడేలా చేయడం, అనంతరం మాడ్యూల్‌ను స్వాధీనం చేసుకుని పునర్వినియోగానికి సిద్ధం చేయడం వంటివి చేపట్టనున్నారు. నౌకాదళం ఇప్పటికే మాడ్యూల్‌ను తిరిగి పొందేందుకు అవసరమైన మాక్ ఆపరేషన్లను చేపట్టింది. అంతరిక్షంలో వ్యోమనౌక సమస్యను ఎదుర్కొంటే సిబ్బందిని తిరిగి భూమికి తీసుకురావడంలో ఈ టెస్టు సాయపడనుంది. ఈ గగన్‌యాన్ మిషన్ విజయవంతమైతే.. భారత్ చేపట్టే మొదటి మానవసహిత అంతరిక్ష యాత్ర ఇదే కానుంది. ఈ మిషన్‌తో ముగ్గురు వ్యోమగాములను అంతరిక్షంలో పంపి.. ఏడు రోజుల తర్వాత వారిని తిరిగి భూమికి చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గతంలో భారత తొలి

## జనసేన నేతల అత్యవసర భేటీ..

దశ నిర్వహణపై చర్చించారు. అలాగే జనసేన - తెలుగుదేశం సమన్వయ కమిటీల ఉమ్మడి సమావేశ నిర్వహణ అంశాలపై చర్చించారు. రైతాంగం ఎదుర్కొంటున్న ఇబ్బందికర పరిస్థితులు, సాగు నీటి నిర్వహణలో ప్రభుత్వ వైఫల్యం వల్ల కృష్ణా పశ్చిమ డెల్టాలో 4 లక్షల ఎకరాలు ఎండిపోయిన అంశం పై సుదీర్ఘంగా చర్చించారు. రైతుల పక్షాన చేపట్టే పోరాటంపై ప్రణాళిక సిద్ధం చేయాలని పవన్ కళ్యాణ్ సూచించారు. ఉద్యోగులకు జీతాలు కూడా సకాలంలో ఇవ్వలేని స్థితి రాష్ట్రంలో ఉందని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, జన సైనికులు, వీర మహిళలపై అక్రమం గాపెడుతున్న కేసులపై ఈ భేటీలో ప్రస్తావనకు వచ్చింది.

### స్వలింగ వివాహాల చట్టబద్ధతపై

# సుప్రీం రెడ్ సిగ్నల్

లో మార్పు చేయాలా వద్దా అనేది పార్లమెంటు నిర్ణయిస్తుంది. శాసన వ్యవస్థలో జోక్యం చేసుకోలేం. ప్రత్యేక వివాహ చట్టాన్ని రద్దు చేయలేం. వివాహ వ్యవస్థకు సంబంధించిన నిర్ణయాలు పార్లమెంట్ మాత్రమే చేయగలదు.' అని సుప్రీంకోర్టు తీర్పులో పేర్కొంది. 'ప్రేమ అనేది మానవత్వ లక్షణం. వివాహ హక్కుల నిర్ధారణకూ ప్రభుత్వం కమిటీ వేయాలి. ప్రతి ఒక్కరికి తమ జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకునే హక్కు ఉంటుంది. అసహజ వ్యక్తుల హక్కులపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు,కేంద్రపాలిత ప్రాంతాలు వివక్ష చూపకూడదు. అసహజ వ్యక్తుల హక్కులు, అర్హతలను నిర్ణయించడానికి కేంద్ర ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేస్తుందని సొలిసిటర్ జనరల్ ప్రకటనను రికార్డు చేస్తున్నాం. రేషన్ కార్డులలో అసహజ జంటలను కుటుంబంగా చేర్చడం, అసహజ జంటలు ఉమ్మడి బ్యాంకు ఖాతా కోసం నామినేట్ చేయడానికి వీలు కల్పించడం, పెన్షన్, గ్రాట్యుటీ మొదలైన వాటి నుంచి వచ్చే హక్కులను కేంద్రం ఏర్పాటు చేసే కమిటీ పరిశీలించాలి.' అని సుప్రీంకోర్టు స్పష్టం తీర్పును వెల్లడించింది. స్పెషల్ మ్యారేజెస్ యాక్ట్‌లోని సెక్షన్ 4 రాజ్యాంగ విరుద్ధం అనొచ్చని సీజేఐ చంద్రచుడ్ అన్నారు. సీజేఐ డీవై చంద్రచూడ్ నేతృత్వంలో జస్టిస్ ఎస్‌కే కౌల్, రవీంద్ర భట్, హిమా కోహ్లీ, పీఎస్ నరసింహలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ అంశంపై సుప్రీంకోరు తీర్పును మే 11న రిజర్వ్ చేసింది. తీర్పును రిజర్వ్ చేసిన 5 నెలల తర్వాత సర్వోన్నత న్యాయస్థానం నేడు తీర్పును వెలువరించింది. స్వలింగ సంపర్క వివాహాలకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ దాఖలైన 20 పిటిషన్‌లపై విచారణ పూర్తైన అనంతరం ధర్మాసనం మేలో తీర్పును రిజర్వ్‌లో ఉంచింది. కాగా, 2018 సెప్టెంబర్‌లోనే భారత సర్వోన్నత న్యాయస్థానం స్వలింగ సంపర్కం శిక్షార్హం కాదని తేల్చింది. పాతకాలపు చట్టాన్ని పక్కనపెట్టి ఇచ్చిన ఈ సంచలన తీర్పుపై అప్పట్లోనే గగ్గోలు పుట్టింది. సాంస్కృతిక విలువలకు తిలోదకాలిచ్చి, పాశ్చాత్య సంస్కృతిని అలవరుచుకుంటున్నామంటూ విమర్శలు రేగాయి. తీరా స్వలింగ సంపర్కం తప్పు కాదని కోర్టు చెప్పినా తమకు సామాజిక అంగీకారం లభించడం లేదనీ, తమపై దుర్విచక్షణ సాగుతూనే ఉందనీ లెస్బియన్, గే, బైసెక్సువల్, ట్రాన్స్‌జెండర్ల (ఎల్జీబీటీక్యూ) వర్గం ఫిర్యాదు చేస్తోంది. స్వలింగ సంపర్కం నేరం కాదనే దశ నుంచి స్వలింగ వివాహాలకు చట్టబద్ధత కోరడం దాకా ఇప్పుడు వచ్చింది. హోమో సెక్సువల్ పెళ్ళిళ్ళను చట్టబద్ధమైనవని గుర్తించాలని కోరుతూ, 2020లోనే ఢిల్లీ, కేరళ హైకోర్టుల్లో కొన్ని ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు దాఖలయ్యాయి. తర్వాత సుప్రీమ్‌కు పిటిషన్లు చేరాయి. కోర్టు కేంద్ర ప్రభుత్వ అభిప్రాయాన్ని కోరింది. మార్చి 13న సుప్రీంకోర్టులో కేంద్రం తన అఫిడవిట్ దాఖలు చేస్తూ, స్వలింగ వివాహాల చట్టబద్ధతకు ససేమిరా అంది. సహజ ప్రకృతికి విరుద్ధంగా జరిపే లైంగిక చర్యలు శిక్షార్హమని భారత శిక్షాస్మృతిలోని 377వ సెక్షన్ మాట. ఆ సెక్షన్ కింద స్వలింగ సంపర్కాన్ని నేరంగా పరిగణించరాదని అయిదేళ్ళ క్రితం తీర్పునిచ్చినంత మాత్రాన ఏకంగా స్వలింగ వివాహాన్ని వివిధ చట్టాల కింద తమ ప్రాథమిక హక్కని పిటిషనర్లు అనుకోరాదని ప్రభుత్వం వెల్లడించింది. స్వలింగ వివాహాలు సమాజంలో కొత్త సమస్యను సృష్టిస్తాయని ఆందోళన వ్యక్తం చేస్తూ.. ఈ వివాహాలకు గుర్తింపు కల్పించకపోవడం వివక్ష కాదని ప్రభుత్వం వాదించింది.


# విశాఖ జిల్లా అభివృద్ధికి అన్ని చర్యలు చేపట్టాలి

గ్లోబల్ ఇన్వెస్ట్మెంట్ వంటి ప్రతిష్టాత్మక కార్యక్రమాలు విశాఖ నగరంలో నిర్వహించామన్నారు. విశాఖ నగరానికి బీచ్ ప్రకృతి ప్రసాదించిన వరమని, పలు బీచ్ లను సుందరంగా అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులో తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. వివిఎంఆర్డిఎ పరిధిలో పెండింగ్ లో ఉన్న పలు ప్రాజెక్టు లను త్వరత గతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిఎంఆర్డిఎ సెక్రటరీ రంగయ్య, జాయింట్ కమిషనర్ రవీంద్ర, ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు క్వాష్ పిటిషన్‌పై తీర్పు రిజర్వు

ఉన్నప్పుడు ఛార్జిషీట్లు వేసి విచారణ జరిపి శిక్ష కూడా వేయవచ్చు" అని రోహత్గీ వాదించారు. దీనిపై జస్టిస్ త్రివేది స్పందిస్తూ.. ఆరోపణలపైనే అన్ని నిర్ణయాలు తీసుకోగలుగుతామా అని ప్రశ్నించారు. అవినీతి కేసుల కిందకు వస్తుందంటే పరిగణించండి.. లేదంటే క్వాష్ చేయండి అని ముకుల్ రోహత్గీ ధర్మాసనం దృష్టికి తెచ్చారు. ఇప్పుడు మనం మాట్లాడుతుంది 17ఏ వర్తిస్తుందా లేదా అనేదే కదా అని జస్టిస్ అనిరుద్ధబోస్ ప్రశ్నించారు. కేసుల నమోదు, ఛార్జిషీట్, విచారణ.. అన్ని కేసుల్లోనూ జరిగేదే కదా అని వ్యాఖ్యానించారు. రోహత్గీ స్పందిస్తూ.. అవినీతి కేసుల్లో ప్రాథమిక ఆధారాలున్నప్పుడు ప్రత్యేక కోర్టుకు విచారించే న్యాయపరిధి ఉంటుందన్నారు. ఈ కేసులో జీఎస్టీ, ఆదాయపన్ను దర్యాప్తులు ఉన్నాయన్నారు. జీఎస్టీ, ఆదాయపన్నుతో పాటు మరికొన్ని విభాగాలు కూడా ఈ కేసును దర్యాప్తు చేశాయని తెలిపారు. "నేరం జరిగిందా లేదా? ఎఫ్ఐఆర్ నమోదైందా? లేదా? అంతవరకే పరిమితం కావాలి. అవినీతి నిరోధక, సాధారణ కేసుల్లోనూ అదే పోలీసులు విచారణ చేస్తారు. ఒకే పోలీసులు విచారణ చేసినప్పుడు ఈ కేసులో ఎఫ్ఐఆర్‌ను ఎలా క్వాష్ చేస్తారు.మీరు అవినీతి ఆరోపణలు వర్తించవంటున్నారు.. మరి ఐపీసీ కింద పెట్టిన కేసులు ఎక్కడికి పోతాయి" అని రోహత్గీ వాదించారు. "మీరు కేసు పెట్టే నాటికి చట్టం అమల్లోకి వచ్చింది.. చట్టం అమల్లోకి వచ్చాక కేసు నమోదైంది. ఈ పరిస్థితుల్లో పాత నేరమంటూ కొత్తగా కేసులు పెట్టడానికి అవకాశం ఎలా ఉటుంది?" జస్టిస్ బోస్ ప్రశ్నించారు. ఈ కోర్టులో జరుగుతున్న వాదనలు కేవలం ప్రొసీజర్ ప్రకారమే కాకూడదు.. కేసులో ఉన్న వాస్తవ విషయాలను పరిగణనలోకి తీసుకోవాలని రోహత్గీ కోరారు. చంద్రబాబు తరఫున సీనియర్ న్యాయవాది హరీష్ సాల్వే వర్చువల్‌గా వాదనలు వినిపించారు. చట్టసవరణను ముందు నుంచి వర్తింపజేసే అంశంపై పలు తీర్పులను ఉటంకిస్తూ వాదనలు వినిపించారు. ఈ సందర్భంగా 2019 నాటి 'శాంతి కండక్టర్స్' కేసు, 1964 నాటి రతన్‌లాల్ కేసును ప్రస్తావించారు. "ఎన్నికల ముందు రాజకీయ కక్ష సాధింపులకు అవకాశం ఉంటుంది. రాజకీయ కక్ష సాధింపులను నిరోధించేందుకు 17ఏ ఉంది. సెక్షన్ 17ఏ లేకపోతే రాజకీయంగా వేధించే అవకాశం ఉంటుంది. ఆధారాల సేకరణ కూడా సరైన పద్ధతిలో జరుగుతుందన్న నమ్మకం లేదు. రిమాండ్ రిపోర్టు, కౌంటరు అఫిడవిట్లు మొత్తం ఆరోపణలతో నిండి ఉన్నాయి. విపక్ష నేతలను విచారించడం తమ హక్కుగా ప్రభుత్వం భావిస్తోంది. మొదట్లో ఎఫ్ఐఆర్‌లో చంద్రబాబు పేరులేదు. రిమాండ్ సమయంలో ఆయన పేరు చేర్చారు. ఈ కేసులో చాలా మంది అధికారులను విచారించామని సీఐడీ చెప్పింది. కానీ, ఒక్కరికి కూడా 17ఏ నిబంధన కింద అనుమతి తీసుకోలేదు. నిబంధనలు పాటించలేదనడానికి ఇదే పెద్ద నిదర్శనం. న్యాయ సమీక్ష జరిగితే కేసు మొత్తం మూసేయాల్సిన పరిస్థితి. జీఎస్టీ చెల్లింపుల విషయాలను ప్రభుత్వానికి ముడిపెడుతున్నారు. ప్రభుత్వం తరఫున జరిగిన అవినీతిగా చూపుతున్నారు. దేన్ని దేనితో ముడిపెడుతున్నారో అర్థం కాని పరిస్థితి.

# ప్రేమ పెళ్లి పేరుతో మోసం చేసిన వ్యక్తికి 25 సం॥ జైలు శిక్ష, రూ॥ 15,000 జరిమానా




విశాఖ క్రైమ్(విజయభాను న్యూస్) : ప్రేమ, పెళ్లి పేరుతో ఒక బాలికను గర్భవతిని చేసి ఆమెకు ఒక కుమారుడు కలగడానికి కారకుడైన వ్యక్తికి 25 సంవత్సరాలు జైలు శిక్ష, 15 వేల రూపాయలు జరిమానా విధిస్తూ నగరంలోని పోక్సో కేసుల ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి జి ఆనంది మంగళవారం తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా ఆరు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి తమ తీర్పులో పేర్కొన్నారు . బాధిత బాలికకు ప్రభుత్వం తరఫున 7 లక్షల రూపాయలు ఇవ్వాలని న్యాయమూర్తి ఆ తీర్పులో స్పష్టం చేశారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసెక్యూటర్ కరణం కృష్ణ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. నిందితుడు జాత రాంబాబు(21) ఉమ్మడి విశాఖ జిల్లా ప్రస్తుతం ఏ ఎస్ ఆర్ జిల్లా జిల్లా, చింతపల్లి మండలం లంబ సంగి పంచాయితీ పరిధిలోని, తోటరాజు బంద గ్రామము. వృత్తి రీత్యా రాంబాబు వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. బాధితురాలు(15) పేదలపుట్టు గ్రామము. రాంబాబుతో ఆమెకు పరిచయం ఏర్పడింది. బాలికకు మాయ మాటలు చెప్పి ఆమెను శారీరకంగా లొంగదీసుకున్నాడు. బాలికను శారీరకంగా మానసికంగా తన వైపు తిప్పుకొని లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలతో తరచూ శారీరకంగా కలిసేవారు. దీంతో బాలిక గర్భం దాల్చింది. ఒక మగ బిడ్డకు పెళ్లయింది. ఈ నేపథ్యంలో నిందితుడు రాంబాబు బాలికపై పలు రకాలుగా నిందలు వేశాడు. బాలిక గర్భం దాల్చడానికి తాను కారణం కాదని, వేరే వ్యక్తితో ఆమెకు అక్రమ సంబంధం ఉందని తప్పించుకున్నాడు. 2018 ఫిబ్రవరి 14వ తేదీన బాలిక ఫిర్యాదు మేరకు చింతపల్లి పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశారు. కేసు ప్రాథమిక విచారణ జరిపిన పోలీసులు నిందితునిపై భారతీయ శిక్షాస్మృతి సెక్షన్376(1), పోక్సో చట్టం సెక్షన్5(1) కింద పోలీసులు కేసు దర్యాప్ చేసి నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పునిచ్చారు.

# పిఎం పాలెంలో మేము సైతం



విశాఖ రూరల్ : మధురవాడ (విజయభాను న్యూస్) : ప్రభుత్వం నాలుగేళ్లలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందని జీవీఎంసీ జోన్ 2 పరిధి 6వ వార్డు టీడీపీ బీసీ సెల్ అధ్యక్షులు రెడ్డి సత్యన్నారాయణ విమర్శించారు. మంగళవారం పిఎం పాలెం ఆర్ హెచ్ కాలని లో "మీతోనే మేము దేనికైనా" కరపత్రాలు ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. అనంతరం రెడ్డి సత్యన్నారాయణ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు పై అక్రమ కేసులు పెట్టి అరెస్ట్ చేసి పైశాచిక ఆనందాన్ని పొందుతున్నారని, ప్రభుత్వం చేస్తున్న అరాచకాలకు ఓటుతో బుద్ధి చెప్పాలని ఇచ్చారు పిలుపునిచ్చారు. టీడీపీ కక్షసాధింపుల కోసం పనిచేయదని, రాష్ట్ర అభివృద్ధి కోసం పనిచేస్తుందని వివరించారు. కార్యక్రమంలో 6 వ వార్డు మహిళా అధ్యక్షురాలు పెంటకోట బబ్బేలు, మైనార్టీ సెల్ అధ్యక్షులు అబ్దుల్ భాష, రౌతు వెంకటరమణ, తాడేల లక్ష్మి, సత్తారపు సత్యం, ముల్లు సూరి బాబు, దారబాబు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



విశాఖ రురల్ బి మధురవాడ (విజయభాను న్యూస్) : జీవో.నెంబర్. 25 ద్వారా జీవీఎంసీ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఎక్సగ్రేస్య ప్రకటించిన సందర్భంగా ప్రాంతీయ సమన్వయకర్త వై.వి. సుబ్బా రెడ్డి సమక్షంలో సీఎం జగన్ చిత్రపటానికి మంగళవారం మహా విశాఖ 8 వ వార్డు పరిధి ఎండాడ వైసీపీ పార్టీ కార్యాలయంలో పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వై.వి. సుబ్బా రెడ్డి మాట్లాడుతూ జీవీఎంసీ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఎదుర్కుంటున్న పలు సమస్యలను యూనియన్ నాయకులు సీఎం జగన్ దృష్టికి తీసువెళ్ళగా సానుకూలంగా స్పందిస్తూ జీవో.నెంబర్. 25 ను విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ఈ జీవో ద్వారా సాధారణ మరణంకు 2 లక్షలు అలాగే ప్రమాదవశాత్తు మృతి చెందిన వారికి 5లక్షల ఎక్సగ్రేస్య ఇవ్వనున్నట్లు తెలిపారు.

అదేవిధంగా పలు విభాగాలకు సంబందించిన ఉద్యోగుల సమస్యలు తమ దృష్టికి తీసుకువచ్చారని అందులో ప్రధానంగా , యూజిడి కార్మికులకు, పిఎచ్ డ్రైవర్లకు, మలేరియా సిబ్బందికి హెల్త్ అల్లోవెన్స్ కొరకు తగు న్యాయం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షులు ఎం.ఆనందరావు, సిఐటియూ యూనియన్ గౌరవ అధ్యక్షులు వెంకట రెడ్డి, కుమార్, ఎర్రజీ, సత్యము, రామకృష్ణ, కృష్ణ, రాజా, శ్రీ రామమూర్తి ప్రసాద్, రవి, గురువోజి, కార్మికులు తదితరులు పాల్గొన్నారు

## అంతర కళాశాల మహిళల ఆటల పోటీలలో సంగివలస ఎన్ ఆర్ ఐ కళాశాల విద్యార్థునులు ప్రతిభ

భీమునిపట్నం : విజయభాను న్యూస్ డాక్టర్ వైయస్ ఆర్ వైద్య విశ్వవిద్యాలయం అంతర కళాశాల మహిళల ఆటల పోటీలలో సంగివలస ఎన్ ఆర్ ఐ కళాశాల విద్యార్థునులు బి ఎల్ ఎస్ రితిక బంగారు పతకం సాధించింది యశస్విని తో డబుల్స్ లో కూడా బంగారు పతకం సాధించిందని ఈనెల ఒకటి నుండి 15వ తేదీ వరకు రాజమండ్రి జిఎస్ఎల్ వైద్య కళాశాలలో జరిగిన పోటీలలో పథకాలను సాధించిన విద్యార్థులను డీన్ డాక్టర్ పివి సుధాకర్ సీఈవో శ్రీ నిరంజన్ వైస్ ప్రిన్సిపల్ శ్రీధర్ రెడ్డిలు విద్యార్థులను అభినందించారు.

# బిజెపి జిల్లా ఉపాధ్యక్షులిగా చొక్కాకుల జగదీశ్వరి నియామకం



కొత్తవలస (విజయభాను న్యూస్) : శృంగవరపుకోట నియోజకవర్గం కొత్తవలస మండలం కాటకాపల్లి గ్రామానికి చెందిన చొక్కాకుల జగదీశ్వరి కి బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులుగా జిల్లా అధ్యక్షులు మేడపాటి రవీందర్ రెడ్డి నియమించారు. ఈ సందర్భంగా జగదీశ్వరి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలోనూ మరియు నైతిక విలువలు కలిగిన పార్టీలో పనిచేయుటకు అవకాశం కల్పించిన భారతీయ జనతా పార్టీ రాజ్యసభ సభ్యులు జీవీఎల్ నరసింహారావు కు, కన్వీనర్ సిహెచ్ ఆర్ కే ప్రసాద్ కు, మాజీ ఎమ్మెల్సీ పివిఎన్ మాధవ్ కు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశి రాజు కు మరియు పార్టీ పెద్ద లందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నాను. నాపై నమ్మకం ఉంచి నాకు ఉపాధ్యక్షురాలుగా నియమించినందుకు శృంగవరపుకోట నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీ బలోపేతానికి నా వంతు కృషి చేస్తానని తెలియజేస్తున్నాను. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అభివృద్ధి మరియు సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి పార్టీ బలోపాతాన్ని కృషి చేస్తాను అని తెలియజేస్తున్నాను.

# ఎంబిఎ విద్యార్థులుకు ఆర్థిక అక్షరాస్యత పై వర్క్ షాప్




భీమునిపట్నం : విజయభాను న్యూస్ తగరపువలస దగ్గర ఉన్న అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో ఎంబిఎ విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యత అనే అంశంపై వర్క్ షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎపి , ఆర్బీఐ ఎల్డీఓ పి.ఎం పూర్ణిమ, విశాఖ,ఎఫ్ ఎల్ సిసి కౌన్సిలర్ మధుసూధనరావు పాల్గొని ఆర్థిక అక్షరాస్యత కు అవసరమైన పరిజ్ఞానాన్ని అందించడం లక్ష్యం గా ఈ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ముఖ్యంగా ఫైనాన్షియల్ ప్లానింగ్,సైబర్ సెక్యూరిటీ,ఎస్.ఎస్ స్కీమ్స్,స్కీమ్స్ రెగ్యూలేషన్ మీద అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.మురళీకృష్ణ,డైరెక్టర్ ఎ. చంద్రశేఖర్, ఎంబిఎ విభాగాదిపతి డా.యు. రాము ,అద్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

# దీపావళి కానుక.. వారందరికీ గ్యాస్ సిలిండర్ ఫ్రీ

బులంద్‌శహర్: ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఆ రాష్ట్ర ప్రజలకు తీపి కబురు చెప్పారు. రాష్ట్రంలో 'ఉజ్వల యోజన' పథకం కింద గ్యాస్ కనెక్షన్లు ఉన్నవారందరికీ దీపావళి కానుకగా ఒక గ్యాస్ సిలిండర్‌ను ఉచితంగా అందిస్తామని ప్రకటించారు. బులంద్‌శహర్‌లో రూ.632 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆదిత్యనాథ్ ఈ మేరకు ప్రకటించారు. "ఉజ్వల యోజన పథకం కింద గ్యాస్ కనెక్షన్లు పొందిన వారిందరికీ సిలిండర్ ధరను రూ.300 మేర తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం మరో అడుగు ముందుకేసింది. రాష్ట్రంలోని ఉజ్వల యోజన లబ్ధిదారులకు దీపావళి కానుకగా ఒక గ్యాస్ సిలిండర్‌ను ఉచితంగా అందిస్తాం.

# వార్డు అభివృద్ధికి సహకరించండి



పరవాడ : జీవీఎంసి 77 వ వార్డు అభివృద్ధికి సహకరించాలని జీవీఎంసి మేయర్ గొలగాని హరి వెంకట కుమారిని వార్డు కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి కోరారు. ఈ మేరకు మేయర్ ను మంగళవారం విశాఖలోని ఆమె చాంబర్ లో కార్పొరేటర్ మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందించారు. దశల వారీలో వార్డు అభివృద్ధికి నిధులు కేటాయించి సహకరిస్తానని మేయర్ తెలిపారని కార్పొరేటర్ వెల్లడించారు.

# జీ వి ఎం సీ మూడవ వార్డ్ లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం



భీమునిపట్నం : విజయభాను న్యూస్ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దాలని సదుద్దేశంతో ప్రతి ఇంటికి వైద్య సిబ్బంది వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి వారి యొక్క ఆరోగ్య స్థితిగతులను తెలుసుకొని వారికి తక్షణమే చర్యలు తీసుకునే విధంగా మంగళవారం భీమిలి శాసనసభ్యులు అవంతి శ్రీనివాసరావు ఆదేశాలతో భీమిలి జీవీఎంసీ 3వ వార్డు ఎగువపేట పరిధిలో ఉన్నటువంటి స్మిత్ స్ట్రీట్ సచివాలయం లో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్స్ ఏడు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసి శస్త్ర చికిత్స అవసరమైన వారికి హాస్పిటల్స్ కి సిఫార్సు చేస్తామన్నారు ఈ కార్యక్రమంలో భీమిలి జీవీఎంసీ 3వ వార్డు కార్పొరేటర్ గంటా అప్పలకొండ మూడవ వైసిపి అధ్యక్షులు అధ్యక్షులు అల్లిపిల్లి నర్సింగరావు, శ్రీ నూకాలమ్మవారి ట్రస్ట్ బోర్డు చైర్మన్ వాసుపల్లి కొండబాబు, , స్పెషలాఫీసర్ డాక్టర్ కళ్యాణ్ , డాక్టర్ అఖిల, అంగన్వాడి సూపర్వైజర్ ప్రమీల , వార్డ్ స్పెషలాఫీసర్ మూర్తి , ఏ ఎమ్ హెచ్ ఓ శ్రీనివాసరావు , ఏ పీ డి సంతోష్ , సి.ఓ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

# అన్యక్రాంతమైన అసైన్డ్ భూములు పేదలకు అప్పజెప్పి హక్కులు కల్పించాలి

- వేలాది ఎకరాల భూములు బడాబాబుల చేతుల్లోకి మారిపోయింది
- అసైన్డ్ భూముల సవరణ చట్టం వెంటనే రద్దు చేయాలలి
- ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సిర్ల ప్రసాద్, గంగారపు సింహాచలం డిమాండ్



శ్రీకాకుళం (విజయభాను న్యూస్):జిల్లాలో అన్యాక్రాంత మైన 24 వేల ఎకరాల అసైన్డ్ భూములు వెంటనే పేదలకు అప్పజెప్పి హక్కులు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సిర్ల ప్రసాద్ ,గంగరాపు సింహాచలం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శ్రీకాకుళంలో ఓ ప్రకటన విడుదల చేశారు. అసైన్డ్ భూములు అన్యాక్రాంతం చేయకుండా ఉండడానికి రాష్ట్ర ప్రభుత్వం 9/77 చట్టాన్ని తీసుకువచ్చిందని వారు తెలిపారు. అయినా మన జిల్లాలో 24 వేల ఎకరాల అసైన్డ్ భూములు అన్యాక్రాంతం అవడం బాధాకరం, జిల్లా అధికారులు వెంటనే జోక్యం చేసుకొని పెద్దల ఆక్రమంలో ఉన్న అసైన్డ్ భూములు పేదలకు అప్పజెప్పి హక్కు పత్రాలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. అసైన్డ్ భూములకు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని ప్రభుత్వం చేపడుతున్న ఈ సర్వేలో పేదల చేతిలో 14 .852.61 ఎకరాలు మాత్రమే ఉన్నట్లు నిర్ధారణ చేసినట్లు తెలుస్తుంది అన్నారు ఆ భూములకు మాత్రమే హక్కు పత్రాలు ఇస్తారని తెలుస్తుంది మిగిలిన 24 వేల ఎకరాల భూములకు ఎవరికి హక్కు పత్రాలు ఇస్తారని వారు ప్రశ్నించారు. 9/77 చట్టాన్ని ఉల్లంఘించి అసైన్డ్ భూములు అన్యాక్రాంతం చేసి చేపల చెరువులు, రొయ్యల చెరువులు, రియల్ ఎస్టేట్లు వివిధ రూపాల్లో వాటిని వినియోగించుకున్నట్లు క్షేత్రస్థాయి సర్వేల్లో వెలుగు చూస్తున్నాయని వారు తెలిపారు. అసైన్డ్ భూములపై అమ్మకాలు కొనుగోలు చేయకూడదని నిషేధం ఉన్నప్పుడే వేలాది ఎకరాల భూములు బడా బాబులు చేతుల్లోకి వెళ్ళిపోతుంటే ఇప్పుడు ప్రభుత్వం తీసుకువచ్చిన అసైన్డ్ భూముల సవరణ చట్టం వలన ప్రస్తుతం పేదల సాగులో ఉన్న భూములు పెత్తందార్ల పరం కాబోతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అసైన్డ్ భూముల సవరణ చట్టం వెంటనే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. సర్వే చేసినటువంటి వివరాలు గ్రామ సచివాలయాల వద్ద వేలాడదీయాలని విషయం ప్రజలందరికీ తెలిచే విధంగా గ్రామాలలో దండోరా వేయించాలని కలెక్టర్ కి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

# విజయభాను సంపాదకీయం

## శాంతి కపోతం !

'యుద్ధం అంటే ఏమిటో నాకు తెలుసు. మనుషులు చనిపోవడం చూశాను. పిచ్చెత్తిపోవడం, ఆసుపత్రిలో నరకం అనుభవించడం చూశాను. కానీ వీటన్నిటి కన్నా ఘోరాతిఘోరమైన విషయం మరొకటి ఉంది. యుద్ధం అంటే వికృతమైన సామూహిక, మానసిక వైకల్యం' అంటాడు కవి, విప్లవ రచయిత, జర్నలిస్టు జాన్ రీడ్. యుద్ధం... అనాగరికం, అమానుషం. యుద్ధం ఒక విధ్వంసం. అది వినాశనానికి ప్రతిరూపం. మానవ ప్రపంచానికి ఒక మాయని గాయం. యుద్ధాల వల్ల సామ్రాజ్య స్థాపన కంటే... అవి చేసిన నష్టాలే ఎక్కువ. సామ్రాజ్యాల్ని నిర్మించిన వారిని చరిత్ర మర్చిపోయి ఉండొచ్చు. కానీ విధ్వంసం సృష్టించిన వాళ్లను, ఆ విధ్వంసం ఆనవాళ్లను మాత్రం ఎప్పటికీ మర్చిపోదు. ఎందుకంటే– యుద్ధాలకు ముగింపు పలికేదీ లేదు. చితులను పేర్చడం ఆపిందీ లేదు. గడచిన యుద్ధాలు చేసిన గాయాల మచ్చలింకా పచ్చిగానే వున్నాయి. సామ్రాజ్యవాద నీడ అలముకున్న ప్రతిచోట... ఏదోక రూపంలో యుద్ధక్రీడ తచ్చాడుతునే వుంటుంది. 'యుద్ధం ఎప్పుడు వచ్చినా, తొలుత మరణించేది సత్యమే' అంటాడు అమెరికన్ రాజనీతిజ్ఞుడు హైరమ్ వారెన్ జాన్సన్. యుద్ధోన్మాదం తలకెక్కిన నియంతలకు, సామ్రాజ్యవాదులకు సత్యంతో పనిలేదు. హితోక్తులు రుచించవు. వారికి కావాల్సింది ఆధిపత్యం... పెద్దన్న పెత్తనం. యుద్ధ నష్టం దేశాల మధ్యనే కాదు– నడిరోడ్డున పడే కుటుంబాల ఛిద్ర రూపం. ఈ నష్టం ఒకరోజుదో, ఒక సంవత్సరానిదో కాదు... కోల్పోయిన ఒక జీవిత కాలానిది.

యుద్ధం రావడానికి కారణాలు అనేకం వుండొచ్చు. కానీ యుద్ధం కారణంగా నలిగిపోయేది... మరణించేది సామాన్యులే. 'మనిషి పుట్టుకతో స్వేచ్ఛాజీవి... కానీ, ప్రతిచోటా సంకెళ్లలో చిక్కుకున్నాడు' అంటాడు రూసో. ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక అధిపత్యం అతి ప్రమాదకరమైన ఆయుధంగా మారినచోట మనిషి స్వేచ్ఛ, హక్కుల కాదు... దేశాల స్వేచ్ఛ, హక్కులు కూడా హననం కావించబడుతున్నాయి. బలమైన దేశం బలహీన దేశాన్ని కబళించడానికి అన్నిరకాల ఎత్తులు వేస్తున్నది. ఉక్రెయిన్ – రష్యాల మధ్య ఘర్షణ ఇంకా కొనసాగుతుండగానే, ఇజ్రాయిల్ – పాలస్తీనాల మధ్య ఘర్షణ మొదలైంది. ఇప్పుడు ఆ ప్రాంతాల్లో జీవితాలు నిరాదరణకు గురవుతున్నాయి. తినడానికి తిండిలేక, నిలువ నీడలేక చిన్నా పెద్ద తేడాలేకుండా భయోత్పాతంతో వణికిపోతున్నారు. వేలాదిమంది యువకులు యుద్ధంలో ప్రాణాలు కోల్పోతున్నారు. 'వయసు మళ్లిన వారు యుద్ధాలను ప్రకటిస్తారు. అయితే... ఆ యుద్ధాల్లో ప్రాణాలు పోగొట్టుకునేది యువకులే' అంటాడు హెర్బర్ట్ హూవర్ అనే అమెరికన్ రాజనీతిజ్ఞుడు. యుద్ధాల వల్ల అనర్థాలు తప్ప ఒరిగేదేమీ వుండదని ప్రపంచవ్యాప్తంగా అనేకమంది శాంతిగాముకులు, రాజనీతిజ్ఞులు చెబుతూనే వున్నారు. యుద్ధానికి ఉవ్విళ్లూరే పాలకుల ధోరణిని ఎద్దేవా చేస్తూ... 'రాజులు చరిత్రకు బానిసలు' అంటాడు టాల్‌స్టాయ్ తన 'వార్ అండ్ పీస్' నవలలో. యుద్ధమనేది ఏదైనా... అది మానవ వినాశనానికి దారిస్తుంది.

మహాకవి శ్రీశ్రీ అంటాడు... 'ఏ దేశ చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం/ నరజాతి చరిత్ర సమస్తం పరపీడన పరాయణత్వం' అని. ప్రపంచంలో దుర్బలులను పీడించే బలవంతుల జాతి వున్నంత వరకు, ఒకవైపు శాంతి వచనాలు వల్లిస్తూనే, మరోవైపు అణ్వాయుధ వ్యాపారం సాగిస్తున్నంత వరకూ ప్రపంచంలో ఏదోక మూల ఘర్షణలు, యుద్ధాలు జరుగుతూనే వుంటాయి. 'రణరంగం కానిచోటు భూ/ స్థలమంతా వెదకిన దొరకదు.../ గతమంతా తడిసె రక్తమున,/ కాకుంటే కన్నీళులతో' అంటాడు శ్రీశ్రీ. ఎలాంటి పరిస్థితులు ఉత్పన్నమైనా యుద్ధం సమర్థనీయం కాదు. 'యుద్ధాన్ని వాయిదా వేయడమే మంచిది' అని ఓ కవి అన్నట్టుగా... యుద్ధాన్ని నిర్ద్వంద్వంగా వ్యతిరేకించాలి. యుద్ధమంటే నాశనమని, యుద్ధమంటే విధ్వంసమనీ, యుద్ధమంటే సర్వ జీవరాశుల మారణహోమమని, యుద్ధం తర్వాత మిగిలేది స్మశాన వైభవమేనని చెప్పే చైతన్యశీలురు ముందుకు రావాలి. యుద్ధోన్మాదం దేశభక్తి కాదని, రణోన్మత్త ఉత్సాహం దేశభక్తి కాదని తెగేసి చెప్పాలి. యుద్ధానికి కాదు... శాంతి స్థాపనకు సాహసం కావాలి. విశ్వమంతా శాంతి కపోతాలై ఎగరాలి.

# విశాఖలో జరగనున్న టి-20 మ్యాచ్ పై సమీక్ష




విశాఖ రూరల్‌బి మధురవాడ (విజయభాను న్యూస్) : నవంబర్ 23న భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య జరుగనున్న టి–20 మ్యాచ్ కు సంబంధించిన ఏసీఏ–విడిసిఏ వైస్సార్ క్రికెట్ స్టేడియం లో మంగళవారం తొలి నిర్వహణ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఎ. మల్లికార్జున్, విశాఖ సిపి రవి శంకర్ అయ్యర్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, ఎసిఎ ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం ఎ.సి.ఎ కార్యదర్శి గోపీనాథ్ రెడ్డి మాట్లాడుతూ నవంబర్ 23 న భారత్, ఆస్ట్రేలియా మధ్య టి–20 మ్యాచ్ ఎసిఎ– విడిసిఎ స్టేడియం లో జరుగుతుందని తెలిపారు. గత మ్యాచ్ లు సమర్థవంతంగా నిర్వహించాం కాబట్టి విశాఖ కు మరో ఆవకాశం లభించిందన్నారు. భవిష్యత్తులో బిసిసిఐ మరిన్ని మ్యాచ్లకు అవకాశం ఇస్తుందని తెలిపారు. మరొసారి సారి భేటీ అయి టిక్కెట్లు అమ్మకాలు ధరలు పై నిర్ణయం తీసుకుంటామని, ఆన్ లైన్ మరియు ఆఫ్ లైన్ లో టిక్కెట్లు అందుబాటులో ఉంచుతామన్నారు, అలాగే సుమారు 10000 మంది వీక్షించే విధంగా బిగ్ స్క్రీన్ ను ఏర్పాటు చేసే ప్రతిపాదన ఉందని తెలిపారు. జిల్లా కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ మ్యాచ్ కు సంభందించి అన్ని ఎర్పాట్లు చర్చించామన్నారు. గతంలో జరిగిన మ్యాచ్ ల్లో కొన్ని లోటు పాట్లుపై కూడా చర్చించి సమర్ధవంతంగా అన్ని శాఖలతో సమన్వయం చేసుకోని ఈ మ్యాచ్ ను నిర్వహిస్తామన్నరు. మ్యాచ్ జరిగే రోజున చిన్న పిల్లలకి, అభిమానులను దృష్టిలో పెట్టుకొని తగు జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు. సిపి రవి శంకర్ అయ్యర్ మాట్లాడుతూ గతంలో మ్యాచ్ లు జరిగినప్పుడు ట్రాపిక్ సమస్య ఎర్పాడిందని, ఈసారి అలాంటి ఇబ్బంది లేకుండా చుస్తామన్నరు. మ్యాచ్ ప్రారంభానికి ముందుగానే వస్తే ట్రాపిక్ సమస్య ఉండదని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అలాగే ఆఫ్ లినెలో టికెట్లను పారదర్శకంగా అమ్మేందుకు తగు చర్యలు చేపడతామని ఏసీఏ ప్రతినిధులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రతినిధులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 59 హామీలతో మేనిఫెస్టోను విడుదల చేసిన కాంగ్రెస్



భోపాల్ : మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ వచ్చే నెల నవంబర్ 17న జరగనుంది. ఈ నేపథ్యంలో ప్రతిపక్ష కాంగ్రెస్ రాష్ట్ర ప్రజలకు హామీల వర్షం కురిపించింది. దాదాపు 59 106 పేజీల ఎన్నికల మేనిఫెస్టోను మధ్యప్రదేశ్ పీసీసి అధ్యక్షుడు కమల్‌నాథ్ మంగళవారం విడుదల చేశారు. అన్ని వర్గాల ప్రజలకు లబ్ధిచేకూర్చే లక్ష్యంలో భాగంగానే మేనిఫెస్టోను రూపొందించినట్లు కమల్‌నాథ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో తమ పార్టీ అధికారంలోకి వస్తే గ్యాస్ సిలిండర్ రూ.500లకు అందజేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. రైతలకు రెండు లక్షల రూపాయల మేర రుణ మాఫీ, అర్హులైన మహిళలకు ప్రతినెలా రూ. 1500 భృతి ఇవ్వనున్నట్లు కాంగ్రెస్ మేనిఫెస్టోలో పేర్కొంది. అలాగే పది లక్షల రూపాయల మేర ప్రమాద బీమా, ఉచితంగా పాఠశాల విద్య, నిరుద్యోగ యువతకు వారి అర్హతను బట్టి నెలకు 1.500 నుంచి రూ.3 వేల వరకు రెండేళ్లపాటు నిరుద్యోగ భృతి, ఉద్యోగులకు పాత పెన్షన విధానాన్నే అమలు చేయనున్నట్లు కాంగ్రెస్ మేనిఫెస్టోలో వెల్లడించింది. అలాగే ప్రతి ఒక్కరికీ రూ. 25 లక్షల ఆరోగ్య బీమా, ఓబిసీలకు 27 శాతం రిజర్వేషన్ వంటి హామీలనిచ్చింది. ఐపీఎల్ జట్టు ఏర్పాటు సహా మొత్తంగా ఈ ఎన్నికల సందర్భంగా ఆ రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ 59 హామీలనిచ్చింది.

## ప్రభుత్వ బంగ్లాను ఖాళీ చేయనక్కర్లేదు.. రాఘవ్ చడ్డాకు ఊరట

దిల్లీ: అధికారిక బంగ్లా విషయంలో ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ రాఘవ్ చడ్డా కు ఊరట లభించింది. చడ్డాకు కేటాయించిన ప్రభుత్వ బంగ్లా ను ఆయన ఖాళీ చేయాల్సిన అవసరం లేదని దిల్లీ హైకోర్టు తీర్పు చెప్పింది. ఈ మేరకు ట్రయల్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను ఉన్నత న్యాయస్థానం పక్కనబెట్టింది. అసలేం జరిగిందంటే.. ఆమ్ ఆద్మీ పార్టీ నేత రాఘవ్ చడ్డా గతేడాది పంజాబ్ నుంచి తొలిసారి రాజ్యసభకు ఎన్నికయ్యారు. తొలిసారి ఎంపీ అయిన 2022 జులైలో టైప్–6 బంగ్లాను కేటాయించారు. అయితే, తనకు టైప్ 7 బంగ్లా కావాలని అభ్యర్థిస్తూ చడ్డా గతేడాది ఆగస్టులో రాజ్యసభ సెక్రటేరియట్‌కు లేఖ రాశారు. అప్పట్లో ఆయన అభ్యర్థనను అంగీకరించిన రాజ్యసభ సచివాలయం.. సెంట్రల్ దిల్లీలోని పాండారా రోడ్డులో ఉన్న టైప్ 7 బంగ్లాను కేటాయించింది. దీంతో ఆ బంగ్లాకు మరమ్మతులు చేయించుకున్న చడ్డా.. తల్లిదండ్రులతో కలిసి గత నవంబరులో ఆ నివాసానికి మారిపోయారు. ఈ కేటాయింపును రాజ్యసభ అధికారిక గెజిట్‌లోనూ నోటిఫై చేశారు. అయితే, రాఘవ్ చడ్డాకు బంగ్లా కేటాయింపును రద్దు చేస్తూ.. ఈ ఏడాది మార్చిలో రాజ్యసభ సచివాలయం నోటీసులు జారీ చేసింది. నిబంధల ప్రకారం.. ఎంపీలుగా ఎన్నికైన మాజీ కేంద్రమంత్రులు, మాజీ గవర్నర్లు, మాజీ ముఖ్యమంత్రులు, లోక్‌సభ మాజీ స్పీకర్లకు మాత్రమే టైప్–7 బంగ్లాను కేటాయిస్తారని పేర్కొంటూ.. ఆయనకు బంగ్లా కేటాయింపును రద్దు చేసింది. చడ్డా బంగ్లా ఖాళీ చేయాలని పేర్కొంది.

దీంతో, రాజ్యసభ సెక్రటేరియట్ నిర్ణయంపై రాఘవ్ చడ్డా ఏప్రిల్‌లో దిల్లీ పాటియాలా హౌస్ కోర్టును ఆశ్రయించారు. దీనిపై అప్పట్లో విచారణ జరిపిన జరిపిన ట్రయల్ కోర్టు.. రాజ్యసభ సచివాలయం నోటీసులపై స్టే ఇస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, ఈ ఉత్తర్వులను రాజ్యసభ సెక్రటేరియట్ సవాల్ చేసింది. అనంతరం విచారణ జరిపిన కోర్టు.. ఆ మధ్యంతర ఉత్తర్వులను ఎత్తివేస్తున్నట్లు అక్టోబరు 5న ఆదేశాలు జారీ చేసింది. "బంగ్లా కేటాయింపును రద్దు చేసిన తర్వాత కూడా రాఘవ్ చడ్డా అదే ఇంట్లో కొనసాగుతానని చెప్పడం సరికాదు" అని కోర్టు వ్యాఖ్యానించింది.

ఈ క్రమంలోనే ట్రయల్ కోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ చడ్డా దిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై మంగళవారం విచారణ జరిపిన ఉన్నత న్యాయస్థానం.. ట్రయల్ కోర్టు ఉత్తర్వులను పక్కనబెట్టింది. రాఘవ్ చడ్డా ఆ ప్రభుత్వ బంగ్లాను ఖాళీ చేయాల్సిన అవసరం లేదని, అందులోనే ఉండొచ్చని కోర్టు స్పష్టం చేసింది.

## పంచాంగం

| చవితి రా. 11.34<br>అనూరాధ రా. 8.31 వ.రా. 1.53ల 3.28 | బుధవారం<br>18-10-2023 |
|---|---|

**మేషం :** ప్రైవేటు సంస్థలలోని వారికి యాజమాన్యంతో ఏకీభావం లోపిస్తుంది. భార్య, భర్తల మధ్య మనస్పర్థలు సమసిపోతాయి. వైద్య రంగాల్లోనివారికి శస్త్రచికిత్సల సమయంలో ఏకాగ్రత అవసరం. స్త్రీలకు పనివారలతో సమస్యలు తలెత్తినా నెమ్మదిగా సమసిపోతాయి. **వృషభం :** ఉద్యోగస్తులు, రాజకీయ నాయకులు సభలు, సమావేశాలలో హుందాగా వ్యవహరించి అందరినీ ఆకటు కుంటారు. కానివేళలో ఇతరుల రాక ఇబ్బంది కలిగిస్తుంది. మీ సంతానం కోసం నూతన పథకాలు రూపొందిస్తారు. కళాకారులకు, రచయితలకు, పత్రికా రంగంలో వారికి గుర్తింపు, రాణింపు లభిస్తుంది. **మిథునం :** ఉపాధ్యా యులకు విద్యార్థుల వల్ల సమస్యలు తలెత్తే ఆస్కారం ఉంది జాగ్రత్త వహించండి. స్త్రీలకు అయిన వారి రాక సంతోషం కలిగిస్తుంది. సిమెంటు, కలప, ఐరన్, ఇటుక, ఇసుక వ్యాపారులకు కలిసిరాగలదు. మానసిక ఆందోళనవల్ల పెద్దల ఆరోగ్యం విషయంలో సంతృప్తి కానరాదు. విద్యార్థినులు ప్రేమ వ్యవహారాలకు దూరంగా ఉండటం క్షేమ దాయకం. **కర్కాటకం :** ఆకస్మిక ప్రయాణాలు వాయిదా పడ తాయి. నిరుద్యోగులు ఒక ప్రకటన పట్ల ఆకర్షితులవుతారు. బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో పనులు పూర్తవుతాయి. స్థిరాస్తుల కొనుగోలు యత్నాలు అను కూలిస్తాయి. **సింహం :** స్త్రీలతో సంభాషించేటపుడు సంయ మనం పాటిం చండి. ప్రయాణాల్లో అధిక శ్రమ ఎదుర్కొనక తప్పదు. ప్లీడర్లకు, ప్లీడర్ గుమస్తా లకు వృత్తిపరమైన చికాకులు తప్పవు. పోస్టల్, ఎల్.ఐ.సి, ఏజెంట్లకు పురోభివృద్ధి. కట్టడాల అక్రమాల నిర్మాణంలో సమస్యలను ఎదుర్కొంటారు. నోరు అదుపులో ఉంచుకోవడం శ్రేయస్కరం. ఉత్తర ప్రత్యుత్తరాలు సంతృప్తిగా సాగుతాయి. **కన్య :** స్త్రీలతో సంభాషించేటపుడు సంయమనం పాటించండి. ప్రయాణాల్లో అధిక శ్రమ ఎదు ర్కొనక తప్పదు. ప్లీడర్లకు, ప్లీడర్ గుమస్తాలకు వృత్తిపరమైన చికాకులు తప్పవు. పోస్టల్, ఎల్.ఐ.సి, ఏజెంట్లకు పురోభివృద్ధి. వ్యవసాయ, తోటల రంగాల వారికి నూతన ఆలోచనలు స్ఫురిస్తాయి. ఖర్చులు అధికమవుతాయి. **తుల :** స్త్రీలతో కలహములు, అన్ని కార్యముల యందు విఘ్నములు ఎదుర్కొంటారు. కొత్త పనులు చేపట్టకుండా ప్రస్తుతం చేస్తున్న వాటి పైనే శ్రద్ధ వహించండి. పత్రికా సిబ్బందికి వార్తల ప్రచురణలో పునరాలోచన మంచిది. ఏ వ్యక్తికీ అతి చనువు ఇవ్వటం మంచిది కాదు. రుణాలు, పెట్టుబడుల కోసం ప్రయత్నిస్తారు. **వృశ్చికం :** కుటుంబ అవసరాలకు, మీ సంతానం కోసం ఫీజులు, బిల్లులవు చెల్లిస్తారు. వృత్తుల్లో వారికి గుర్తింపు లభిస్తుంది. ముక్కుసూటిగా పోయే మీ తీరు ఇబ్బందులకు దారితీస్తుంది. ప్రింటింగ్, స్టేషనరీ రంగంలోని వారికి పనివారలతో చికాకులను ఎదుర్కుంటారు. **ధనుస్సు :** ఉద్యోగస్తులకు అధికారుల తీరు నిరుత్సాహం కలిగిస్తుంది. ఒక అవసరానికి ఉంచిన ధనం మరో ఖర్చుకు వినియోగించవలసి వస్తుంది. స్త్రీలు తేలికగా మోసపోయే ఆస్కారం కలదు. కాంట్రాక్టర్లకు, బిల్డర్లకు ఒత్తిడి, పనివారలతో చికాకులు తప్పవు.. **మకరం :** ఉపాధ్యాయులకు నూతన వాతావరణం, పరిస్థితులు ఆందోళన కలిగిస్తాయి. సంఘంలో పలుకుబడి గల వ్యక్తుల సహకారంతో మీ పనులు సాను కూలమవుతాయి. ఒంటెత్తు పోకడ మంచిది కాదని గమనించండి. **కుంభం :** గృహంలో నూతన వస్తువులను అమర్చు కోగలుగుతారు. వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు తొలగిపోతాయి. వస్త్ర, బంగారం, వెండి ఫ్యాన్సీ వ్యాపారాల్లో పోటీతత్వం అధికంగా ఉంటుంది. **మీనం :** ప్రింటింగ్ రంగాల వారికి బకాయిల వసూళ్ళలో శ్రమాధిక్యత, ప్రయాసలు తప్పవు. బంధువులకు పెద్దమొత్తంలో ధనసహాయం చేయునపుడు పునరాలోచన అవసరం. దైవ కార్యక్రమాల్లో పాల్గొంటారు.

# భక్తుల పాలిట పెన్నిధి కర్మన్‌ఘాట్ ఆంజనేయస్వామి

సంకీర్తన

శ్రీఆంజనేయస్వామి భక్తులపాలిట పెన్నిధి. నిత్యం రామ ధ్యానంలో వుండే ఆయనను స్మరిస్తే అన్ని రకాల భూత, ప్రేత, పిశాచ భయాలను పోగొడతాడు. ధ్యానముద్రలో స్వయంభువుగా వెలిసిన శ్రీ ఆంజనేయస్వామి అవతరించిన క్షేత్రమే హైదరాబాద్‌లోని కర్మన్‌ఘాట్ ఆలయం. వందల ఏళ్ల నుంచి భక్తులను దీవిస్తూ ధ్యానముద్రలో వున్న అంజనాసుతుని దర్శనాన్ని చేసుకుంటే అన్ని రకాలుగా మంచి ఫలితాలు లభిస్తాయి.

ముఖ్యంగా సంతానం లేనివారు స్వామిని దర్శించి నిండుమనస్సుతో ప్రార్థిస్తే సంతానం కలుగుతుందని పెద్దలు చెబుతారు.

రెండో ప్రతాపరుద్రునికి దర్శనం..

క్రీ.శ. 1148లో కాకతీయ సామ్రాజ్యాన్ని పరిపాలించే రెండో ప్రతాపరుద్రుడు వేటాడుతూ అలసి ఇక్కడ ఒక రాయిపై విశ్రమిస్తాడు. కాసేపటికి అతనికి పులి గాండ్రింపు శబ్దాలు వినిపించడంతో అప్రమత్తుడ్కై విల్లంబులు ధరించి అక్కడకు వెళుతాడు.

అక్కడ ఏమి కనిపించకపోవడంతో తిరిగి రాయి వద్దకు వస్తాడు. మళ్లీ పులి గాండ్రింపు వినరావడంతో తిరిగి గాలిస్తాడు. అప్పుడు కూడా ఎలాంటి జంతువు కనిపించలేదు. అదే సమయంలో రామశబ్దం రావడంతో చేతులు జోడించి ఆ అదృశ్యమూర్తిని ప్రార్థిస్తాడు. ధ్యానం చేస్తే దర్శనమిస్తానని ఆ మూర్తి స్వరం వినిపిస్తుంది. దీంతో రాజు అక్కడ ఏకాగ్రతతో ధ్యానం చేస్తాడు. కొద్దిసేపటికి ఇక లే నాయనా అంటూ స్వరం వినిపించడంతో రాజు కళ్లు తెరిచి ఆ శబ్దం వచ్చిన చోట వెతకగా ధ్యానాంజ నేయస్వామి విగ్రహం లభ్యమైంది.

పరమానందభరితుడ్కైన రాజు ఆ విగ్రహానికి పూజలు చేసి కోటకు తిరిగి వెళ్లిపోతాడు. ఆ రాత్రి కలలో స్వామివారు అతనికి ప్రత్యక్షమై తనకు ఆలయం నిర్మించమని ఆదేశిస్తారు. స్వామి అనుజ్ఞ ప్రకారం ఆలయాన్ని నిర్మించినట్టు చారిత్రక ఆధారాలు తెలుపుతున్నాయి. స్వామివారిని అనంతరం కాకతీయ రాజులందరూ ఇష్టదైవంగా పూజించడంతో క్షేత్ర మహిమ అన్ని ప్రాంతాలకు వ్యాపించడంతో భక్తులు వేల సంఖ్యలో స్వామి దర్శనానికి వచ్చేవారు.

స్వామివారే హెచ్చరించారు..

17వ శతాబ్దంలో గోల్కొండ సామ్రాజ్యాన్ని మొగల్ పాలకుడు ఔరంగజేబ్ స్వాధీనం చేసుకున్నాడు. అతని సైన్యంలోని కొందరు ధ్యానాంజనేయస్వామి ఆలయం వద్దకు చేరుకొని ఆలయాన్ని ధ్వంసం చేసేందుకు యత్నించారు. అయితే స్వామి దివ్యశక్తితో వారు విజయం సాధించలేకపోయారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఔరంగజేబ్ స్వయంగా దాడికి దిగాడు. ఈ క్రమంలో ఆలయం వద్దకు చేరుకోగా ఆలయం నుంచి పెద్ద స్వరంతో 'మందిర్ తోడ్‌నా హైతో పహలె తుమ్ కరో మన్‌ఘట్'(ఆలయాన్ని ధ్వంసం చేయాలనుకుంటే మనస్సును గట్టిగా చేసుకో) అని పలికింది. దీంతో ఔరంగజేబ్ తనకు కనపడమని కోరగా తాటిచెట్టు కంటే ఎత్తైన రూపం కనిపించడంతో అతను భీతిల్లి వెనుదిరిగాడు. కరో మన్‌ఘట్ అన్న పేరే కర్మన్‌ఘాట్‌గా మారింది.

నిత్యపూజలు

స్వామివారి ఆలయంలో నిత్యపూజలు జరుగుతుంటాయి. రోజూ వందలాది మంది భక్తులు స్వామి వారి దర్శనం కోసం వస్తుంటారు. ఈ ఆలయ ప్రాంగణంలో పలు ఉపాలయాలను నిర్మించారు.

ప్రశాంతమైన వాతా వరణంలో వుండే ఆలయంలో స్వామివారి మూలవిరాట్ విగ్రహాన్ని దర్శించుకుంటే



మనసుకు ప్రశాంతత చేకూరు తుంది. కొత్తగా కొనుగోలు చేసిన మోటార్ వాహనాలకు ఇక్కడ పూజ చేయిం చడం సంప్రదాయం. నిత్యం అనేక వాహనాలకు శకట పూజ జరుగుతుంది.

ఇలా చేరుకోవచ్చు


హైదరాబాద్ నగరంలోని ఇన్నర్ రింగ్‌రోడ్డు సమీపంలో ఆలయం వుంది.

దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్‌ల నుంచి చేరుకోవచ్చు.

మీర్‌పేట్, జిల్లెల్లగూడ, నాదర్‌గుల్, ఆర్.ఎన్.రెడ్డినగర్...తదితర శివారు ప్రాంతాలకు వెళ్లే సిటీ సర్వీసులు కర్మన్‌ఘాట్ మీదుగానే వెళుతాయి.

# సిబ్బంది సమయపాలన పాటించకపోతే కఠిన చర్యలు

## జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ హెచ్చరిక
## కిలగాడ, పర్రెడ, సొలభం 1 సబ్బందికి జీతాలు నిలుపుదల



అల్లూరిజిల్లా. విజయభాను. న్యూస్. పాడేరు.. గ్రామ సచివాలయం సిబ్బంది సమయపాలన పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ హెచ్చరించారు. కార్యాలయాలకు ఆలస్యంగా హాజరుకావడం, ముందుగానే కార్యాలయాలకు తాళం వేసి వెళ్లిపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేసారు. కలెక్టర్ కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి 22 మండలాల ఎంపిడి ఓలు, ఎం ఇ ఓలు, ఉపాధి హామీ అధికారులు, ఇంజనీరింగ్ అధికారులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉపాధి హామీ పనులు, ఆధార్ సీడింగ్, రైతు భరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయాల నిర్మాణాలు, మన బడి నాడు పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముంచింగ్‌పుట్టు మండలం కిలగాడ, పెదబయలు మండలం పర్రెడ, జి.మాడుగుల మండలం సొలభం-1 గ్రామ సచివాలయాలను డి ఎల్ డి ఓ తనిఖీకి వెళ్లినపుడు సాయంత్రం ఐదు గంటలకు ముందే కార్యాలయాలకు తాళం వేసి ఉందని సంబంధిత సచివాలయం సిబ్బందికి జీతాలు నిలుపుదల చేయాలని ఎంపిడిఓలను ఆదేశించారు. అటవీ హక్కు పత్రాలు కలిగిన గిరిజన రైతులకు ఉపాధి పనులు కల్పించడానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. ఉపాధిపనులు కల్పనలో మారేడు మిల్లి, జి.కె. వీధి, రంపచోడవంర , జి.మాడుగల మండలాలో వెనుకబడి ఉన్నారని పురోగతి సాధించాలని స్పష్టం చేసారు.

ప్రతీ పంచాయతీ లో ఉపాధి పనులు గుర్తిచాలని ఆదేశించారు. జిల్లాలో 20వేల వరకు చెరువులు ఉన్నాయని పనులు గుర్తించి పెద్ద ఎత్తున ఉపాధి పనులు నిర్వహించాలని చెప్పారు. అంగన్వాడీ కేంద్రాలలో కిచెన్ గార్డెన్లు పెంచాలని సూచించారు. ఉపాధి కూలీలకు ఆధార్ సీడింగ్ చేయడాలని అన్నారు. మంజూరు చేసిన బర్త్ సర్టిఫికేట్లను వెంటనే లబ్దిదారులకు పంపిణీ చేయాలని చెప్పారు. గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల నిర్మాణపు పనుల బిల్లులు ఎక్కడా పెండింగ్ లేవని అన్నారు. ప్రాధన్యతా భవన నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. భవనాలు లేని పాఠశాలల వివరాలను ఈనెల 21 వ తేదీలోగా సమర్పిస్తే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామని చెప్పారు. మన బడి నాడు నేడు పనులు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఐటిడి ఏ పిఓ వి. అభిషేక్ ,రంపచోడవరం పి ఓ సూరజ్ గనోరే, జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు, డివిజనల్ పంచాయతీ అధికారి పి. ఎస్. కుమార్, డి ఎల్ డి ఓ శాంతలక్ష్మి, ఉపాధి హామీ ఎపిడి జె. గిరిబాబు, డిబిటి మేనేజర్ నరేష్, 22 మండలాల ఎం.పి.డి. ఓలు, ఎం.ఇ.ఓలు, ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ వైస్సార్ హెల్త్ యూనివర్సిటీ మీటింగ్ హాలు లో ఏపీ మెడికల్ కౌన్సిల్ సమావేశం,లో పాల్గొన్న ఏపీ మెడికల్ కౌన్సిల్ మెంబెర్



డాక్టర్ తమర్భ నర్సింగరావు అల్లూరిజిల్లా. విజయభాను.న్యూస్. పాడేరు.. విజయవాడలోని వైయస్సార్ హెల్త్ యూనివర్సిటీలో ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ సాంబశివారెడ్డి అధ్యక్షతన జనరల్ బాడీ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో ఏపీ కి సంబంధించిన వివిధ ఆరోగ్య శాఖ విషయాలు చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమం లో వైస్సార్ హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్సెలర్ డాక్టర్ బాబ్జి ,డీఎంఇ డైరెక్టర్ డాక్టర్ రామనరసింహ, ఏపీ వివిపి జాయింట్ కమిషనర్,రిజిస్టర్ ఆఫ్ మెడికల్ కౌన్సిల్ డాక్టర్ రమేష్ గారు, ఐఎంఏ మాజీ ప్రెసిడెంట్ ప్రసాద్ రెడ్డి డాక్టర్ తమర్భ నర్సింగ రావు మెడికల్ కౌన్సిల్ మెంబెర్స్ పాల్గొన్నారు. అనంతరం వైయస్సార్ హెల్త్ యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ వైస్ ఛాన్సర్ డాక్టర్ బాబ్జి గారిని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా పాడేరు మెడికల్ కాలేజ్ కు సంబంధించిన ప్రోగ్రెస్ ను ఆయనకు తెలియజేయడం జరిగింది. దీంతోపాటు గిరిజనులు ఎదుర్కొంటున్న వివిధ అనారోగ్య సమస్యలపై చర్చించారు.

# రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి...



అల్లూరిజిల్లా. విజయభాను న్యూస్.. జి.మాడుగుల మండలం కె.పెదబయలు నుండి బొడ్డపట్టు వరకు మూడు కిలోమీటర్ల రహదారి నిర్మాణ పనులకు పాడేరు శాసనసభ్యులు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి మంగళవారం శంకుస్థాపన చేశారు. కోటి రూపాయల జాతీయ ఉపాధి హామీ నిధులతో ఈ రహదారి నిర్మాణం కానుంది. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి మాట్లాడుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామాలను మండలాలకు అనుసంధానం చేసే ప్రక్రియ వేగవంతంగా సాగుతుందన్నారు. గతంలో ఈ మాదిరి అభివృద్ధి గిరిజన ప్రాంతంలో జరిగిన పరిస్థితులు లేవని ఆమె చెప్పారు. ఇంత జరుగుతున్న ప్రతిపక్షాలు లేనిపోని ఆరోపణలు విమర్శలు చేయడం తగదన్నారు. స్వాతంత్రం వచ్చి 73 కి ముందు 73 తర్వాత అనే పరిస్థితి ఈరోజు వైఎస్ఆర్సిపి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరిగిన అభివృద్ధిని బట్టి చెప్పాల్సి వస్తుందని చెప్పారు. ఒకపక్క సంక్షేమానికి మరోపక్క అభివృద్ధికి సమ ప్రాధాన్య ఇస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. స్థానిక సర్పంచ్ చిన్న కుమారి, వైస్ ఎంపీపీ కుడుముల సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షులు నుర్మని మత్స్య కొండం నాయుడు, జి.మాడుగుల సర్పంచ్ కిముడు రాంబాబు, సొలభం సర్పంచ్ ఐసరం హనుమంతరావు, జెసిఎస్ మండల కన్వీనర్ లంకేల కళ్యాణ్, సొలభం ఎంపీటీసీ కే చిన్నారావు , సర్పంచుల ఫోరం అధ్యక్షులు సురభంగి రామకృష్ణ, జి. సన్యాసి దొర, కోరాపల్లి వైయస్సార్ సిపి నాయకులు ఎం బాలన్న, లువ్వా సింగి సర్పంచ్ ఎం గంగరాజు, వైయస్సార్సీపి సీనియర్ నాయకులు ఎం. వెంకటరమణ, సచివాలయ కన్వీనర్లు సూర్య ప్రకాష్ ,మహేష్, బి ఉమా కళ్యాణ్, కె చంద్రపతి, బి మత్స్య కొండబాబు, ఐసారం శివ, గొడవ రాజశేఖర్ ,రిమెల తిరుపతిరావు, జువాది కాసులమ్మ, రీమేలి వరలక్ష్మి ,ఇంకా గృహ సారధులు తదితరులు పాల్గొన్నారు.

# గుప్పెడు బాదంతో ప్రోటీన్ సమస్యకు చెక్ పెట్టండి!




ప్రతి రోజూ గుప్పెడంత బాదం పప్పు తీసుకోవడం ద్వారా ప్రోటీన్ సమస్యలను సమర్ధవంతంగా అరికట్టవచ్చని ప్రముఖ సెలబ్రేటీ, ఫిట్నెస్ కోచ్ సుచేతాపాల్ తెలిపారు. మంగళవారం నగరంలో జరిగిన కాలిఫోర్నియా అల్మండ్స్ బాదంపే చర్చా కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మన శరీరం సక్రమంగా నడవాలంటే తీసుకునే ఆహార పదార్థాలలో ప్రోటీన్ (మాంసకృత్తులు) తప్పనిసరిగా ఉండాలన్నారు. ఒక సర్వే ప్రకారం భారతీయులలో 73 శాతం మంది సరిపడినంత ప్రోటీన్ తీసుకోవడం లేదని తేలిందన్నారు. 90 శాతం మందికి దీని ఆవశ్యకతపై అవగాహన లేక పోవడమే ప్రధాన కారణమన్నారు. ఆహారంలో తగినంత ప్రోటీన్ తీసుకోవాల్సిన ప్రాధాన్యతపై అవగాహన కల్పించేందుకు ఆల్మండ్ బోర్డ్ ఆఫ్ కాలిఫోర్నియా ఆధ్వర్యంలో జరిగిన భారత దేశం ప్రోటీన్ సమస్య-సహజ దృక్పథం అనే అంశంపై జరిగిన సదస్సులో ప్రోటీన్ ఏ విధంగా సమకూర్చుకోవాలో అనే దానిపై ప్రధానంగా చర్చించారు. ప్రతి వ్యక్తి శరీర బరువులో ప్రతి కిలోగ్రాముకు రోజూ సగటున 0.8 గ్రాములు ప్రోటీన్ తీసుకోవాలని సూచించారు. అయితే, భారతీయులు సగటున శరీర బరువులో కిలోగ్రాముకు 0.6 గ్రాములు మాత్రమే తీసుకుంటున్నారన్నారు. ఈ సందర్భంగా న్యూట్రిషన్ అండ్ వెల్‌నెస్ కన్సల్టెంట్ షీలా కృష్ణస్వామి మాట్లాడుతూ ఆహారంలో ప్రోటీన్ చేర్చినట్లయితే శరీరం ఆరోగ్యవంతంగా ఉంటుందన్నారు. పప్పు దినుసులు, విత్తనాలు, సిరి ధాన్యాలు, గుడ్లు, చికెన్, చేపలు తదితర వాటిలో మాంస కృత్తులు అధికంగా ఉన్నాయన్నారు. మొక్కల అధారిత మాంసకృత్తులు తీసుకోవాలనుకునే వారి కోసం సోయాబీన్స్, పప్పు దినుసులు, విత్తనాలు, బాదం పప్పు ఉన్నాయన్నారు. 30 గ్రాముల బాదం పప్పు నుంచి 6.3 గ్రాముల మాంసకృత్తులు లభిస్తాయన్నారు. బాదంలో జింక్, ఐరన్, మెగ్నీషియం, ఫాస్పరస్, విటమిన్ ఈ, విటమిన్ బీ2 ఉంటాయన్నారు.

మాంసకృత్తులు లేకపోవడం వల్ల శాకాహారులు బరువు పెరిగిపోతారని, జీర్ణం చేసుకునే శక్తి ఉండదనేది ఒక అపోహ మాత్రమే నన్నారు. మాంసకృత్తులు వల్ల బరువు తగ్గుతారని, కండరాల శక్తి పుంజుకుంటుందన్నారు. డైట్ లో ప్రోటీన్ కండరాల పెరుగుదలకు, ఆరోగ్యంగా ఉండటానికి అత్యవసరమని గుర్తించారన్నారు. ఆకలి లేకుండా చేసి, మంచి శరీర ఆకృతి కోసం వీటిని తీసుకోవాలన్నారు. కార్యక్రమం లో పాల్గొన్న న్యూట్రిషన్ అండ్ వెల్నెస్ కన్సల్టెంట్ షీలా కృష్ణ స్వామి మాట్లాడుతూ కాలిఫోర్నియా బాదంపప్పులు సహజమైన, ఆరోగ్యకరమైన, నాణ్యమైన ఆహారమన్నారు. 1950వ సంవత్సరంలో కాలిఫోర్నియా లోని మొడెస్టోలో స్థాపించ బడిన ఆల్మండ్ బోర్డ్ ఆఫ్ కాలిఫోర్నియా అనేది కాలిఫోర్నియాలోని 7,600 మంది బాదం రైతులు, ప్రాసెసర్‌ల తరపున మార్కెటింగ్, వ్యవసాయం, ఉత్పత్తికి సంబంధించిన అన్ని అంశాలపై పరిశోధన చేస్తుందన్నారు. ఇది యునైటెడ్ స్టేట్స్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చర్ పర్యవేక్షణలో పెంపకందారు, అనుమతించ బడిన ఫెడరల్ మార్కెటింగ్ ఆర్డర్‌ను నిర్వహించే ఒక లాభాపేక్ష లేని సంస్థన్నారు. దీనికి సంబంధించిన మరింత సమాచారం కోసం www.almonds.in వెబ్సైట్ ను సందర్శించాలన్నారు.

# గిరిజనుల ప్రతి సమస్య పైన ఎస్టి కమిషన్ స్పందిస్తుంది

## జగనన్న ఆరోగ్యశ్రీ సురక్ష కార్యక్రమం ద్వారా వైద్యంపై పేదల ఖర్చు తగ్గుతుంది

అనంతగిరి విజయభాను న్యూస్ : పేదరిక నిర్మూలనే ధ్యేయంగా సాగుతున్న జగన్మోహన్ రెడ్డి పాలన ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకర్రావు అనంతగిరి గిరిజనులు ఎదుర్కొంటున్న ప్రతి సమస్య పైన ఎస్టి కమిషన్ స్పందిస్తుందని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు అన్నారు. చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటిసారిగా ఆయన మంగళవారం అనంతగిరి మండలంలో పర్యటించారు. కాశీపట్నం కొత్తమ్మ తల్లి గుడి వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం కొత్తూరు కస్తూరిబా పాఠశాలలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా శిబిరంలో ఏర్పాటు చేసిన అంగన్వాడీ స్టాల్ ను అదేవిధంగా రోగులకు అందుతున్న వైద్య సేవలను నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ శెట్టి నీలవేణి అధ్యక్షతన నిర్వహించిన సభలో మాట్లాడుతూ దేశంలో పేదరికం పెరిగేందుకు విద్య వైద్యంపై సామాన్యుడు అధికంగా ఖర్చు చేయడమే కారణమని ఆయన అన్నారు. ఈ మేరకు పేదరిక నిర్మూలన ధ్యేయంగా జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం విద్యా వైద్య రంగాలకు పెద్దపీట వేస్తుందని అందులో భాగంగానే ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ద్వారా ప్రాథమిక వైద్యంతో పాటు ప్రత్యేక వైద్యాన్ని ప్రజల ముంగిటకే తీసుకొని వచ్చిందని ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రస్తుత గవర్నమెంటు వైద్యరంగంలో పెను మార్పులను తీసుకుని వస్తుందన్నారు. ఈ మేరకు ఆసుపత్రులలో క్షేత్రస్థాయి సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమించడంతోపాటు వైద్యుల కొరతను 98% భర్తీ చేసి పేదలకు మెరుగైన వైద్యం అందే దిశగా చర్యలు తీసుకుందని తెలిపారు. అనంతగిరి మండల పరిధిలో భౌగోళిక పరిస్థితుల దృష్ట్యా వివిధ ప్రమాదాలలో మృతి చెందుతున్న వారికి విజయనగరం జిల్లా ఎస్.కోట గజపతినగరం అనకాపల్లి జిల్లా చోడవరం వంటి ప్రాంతాలలో సిహెచ్సి ల వద్ద పోస్టుమార్టం నిర్వహించాల్సిన పరిస్థితులలో జిల్లా వేరు కావడంతో ఇబ్బందులు





తలెత్తుతున్నాయని ఈ మేరకు అనంతగిరి మండల పరిధిలో మృతదేహాలకు ఎక్కడైనా పోస్ట్ మార్టం నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ శెట్టి నీలవేణి ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ శంకర్రావు గారిని కోరారు. ఈ సమస్యపై పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు. అదేవిధంగా పర్యాటక శాఖ పరిధిలో పనిచేస్తున్న టూరిజం కార్మికుల సమస్యలను యూనియన్ ప్రతినిధులు నరసింహ,సోమేష్, బుద్దరాజు సన్యాసమ్మ తదితరులు ఎస్టీ కమిషన్ చైర్మన్ కు వినతిపత్రం అందజేశారు. అరకులోయ రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని శివలింగపురం వైఎస్ఆర్సిపి నాయకులు ఇక కపాటి వీరభద్రరావు కోరారు. స్థానిక సమస్యలను చైర్మన్ దృష్టికి పలువురు తీసుకొని వెళ్లారు. అనంతరం పుట్ట చింత గ్రామంలో ఇటీవల ప్రమాదంలో మృతి చెందిన వంతల మోహన్ కుటుంబ సభ్యులను ఎస్టి కమిషన్ చైర్మన్ శంకరరావు తో పాటు కమిషన్ సభ్యురాలు కుర్ర రామలక్ష్మి స్వచ్ఛందంగా కార్పొరేషన్ డైరెక్టర్ సోమేశ్వరి వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు శెట్టి గంగాధర స్వామి తదితరులు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సారా సీతయ్య, ఎంపీటీసీ సభ్యులు మూతిబోయిన సన్యాసిరావు, వైఎస్ఆర్సిపి పార్టీ అధ్యక్షుడు రేగబోయిన స్వామి, పార్టీ నాయకులు గంగులు, గంగరాజు, సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు పాగి అప్పారావు వైస్ సర్పంచ్ నరేంద్ర కోఆప్షన్ సభ్యుడు షేక్ మదీనా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కొండలరావు సహాయ గిరిజన సంక్షేమ అధికారి వెంకటరమణ ఎంపీడీవో హర్షిత్ ,తాసిల్దార్ రాంబాయి, ఎస్సై కరక రాము ఆర్ఐలు లక్మి కాంత్,శంకర్రావు పంచాయతీ కార్యదర్శి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఆదిత్య డిగ్రీ కళాశాలలో మీడియా రేటింగ్స్ పై వర్క్ షాప్

## సమాజాన్ని ఆలోచింపచేసేదే వార్త : సీనియర్ జర్నలిస్టు కె.శ్రీనివాసు




కాకినాడ : ఆదిత్య డిగ్రీ కళాశాల తెలుగు శాఖ మానికి రెడ్డి హెల్త్ కేర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు " మాధ్యమాలకు రాయడంపై వర్క్ షాప్" నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ,పీ జీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డా. బి ఈ వి ఎల్. నాయుడు తెలిపారు.

ఆదిత్య డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మాధ్యమాలకు రాయడంపై వర్క్ షాప్ నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన, ప్రార్థన గీతంతో ప్రారంభమైన ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన అకడమిక్ డైరెక్టర్ డా.బి ఈ వి ఎల్. నాయుడు మాట్లాడుతూ సమాజాన్ని చైతన్య పరచే సృజనాత్మక రచన మాధ్యమాలకు రాయడమని, విద్యార్థులకు ఇదో విభిన్నమైన రంగమని అన్నారు. విద్యార్థులు సాఫ్ట్వేర్, ఐటీ వంటి రంగాలతో పాటు మీడియా రంగాన్ని కూడా ఎంపిక చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా విచ్చేసిన ఎన్ఎస్ఎస్ అడ్వైజరీ కమిటీ మెంబర్ డా.మానికిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ మీడియా అత్యంత ప్రభావవంతమైన రంగమని అనేక అవకాశాలతో పాటు, అరుదైన గౌరవం దక్కే ఈ రంగంలో విద్యార్థులు అనేక విషయాలు తెలుసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఈనాడు వార్తాపత్రిక సీనియర్ జర్నలిస్టు

కొరిపెల్ల శ్రీనివాసు మాట్లాడుతూ వార్త సమాజాన్ని ఆలోచింపజేయాలని, చైతన్య పరచాలని తెలిపారు. వార్త రాసే విధానాన్ని విద్యార్థులకు నేర్పించారు. శీర్షిక ఉప శీర్షికల ప్రాధాన్యాన్ని వివరించారు. వార్తాపత్రికకు సంపాదకీయం గుండెకాయ అని తెలిపారు. వాస్తవాలకు ప్రతిబింబమే వార్త అని అన్నారు. అనంతరం విద్యార్థులకు వార్తా రచన, యాంకరింగ్,న్యూస్ రీడింగ్ పోటీలు నిర్వహించి ప్రశంసా పత్రాలను, జ్ఞాపికలను అందజేశారు.

ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఆదిత్య డిగ్రీ కళాశాల తెలుగు శాఖ అధ్యాపక బృందాన్ని ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ డా. నల్లమిల్లి శేషారెడ్డి, సెక్రెటరీ డా.నల్లమిల్లి సుగుణ రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, క్యాంపస్ ఇన్చార్జి మూర్తి ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి,తెలుగు శాఖధిపతి తేజేశ్వరరావు,ఎల్. దివాకర రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలి ఐటీడీఏ పీవో విష్ణు చరణ్




పార్వతీపురం/సాలూరు విజయభాను న్యూస్ అక్టోబరు 17 ఫ గృహ నిర్మాణ పథకంలో మంజూరైన ఇంటి నిర్మాణాలను వెంటనే ప్రారంభించి, సకాలంలో పూర్తి చేయించాలని ఐ.టి.డి.ఎ. ప్రోజెక్టు అధికారి సి.విష్ణుచరణ్ హౌసింగు అధికారులను ఆదేశించారు. గృహ నిర్మాణాలపై సాలూరు నియోజక వర్గ స్థాయి సమీక్షా సమావేశాన్ని ప్రోజెక్టు అధికారి చాంబరులో నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రోజెక్టు అధికారి మాట్లాడుతూ ఇళ్లు మంజూరై ఇంకా నిర్మాణాలు ప్రారంభించని లబ్దిదారులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలపై అవగాహన కల్పించి వెంటనే ప్రారంభించే అయినట్లు ప్రోత్సహించాలని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు గృహ నిర్మాణాలు పూర్తిచేయాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు.


జగనన్న కాలనీలలో నిర్మాణ పనులు వేగవంతం చేయుటకు మరియు పూర్తిచేయుటకు అవసరమైన మౌళిక సదుపాయాలు కొరత లేకుండా చూడాలని తెలిపారు.


ఈ సమావేశంలో హౌసింగ్ డిప్యూటీ ఇంజనీర్లు, సహాయ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

# మధుమేహానికో కోత

## ఎండోస్కోపిక్ బేరియాట్రిక్ చికిత్సలు







అసలే ఊబకాయం. ఆపై మధుమేహం. రెండూ కలిస్తే అగ్నికి ఆజ్యం తోడైనట్టే. బరువు తగ్గితే రెండింటినీ అదుపు చేసుకోవచ్చు. ఇందుకు ఆహార, వ్యాయామ నియమాలు కీలకమన్నది నిజమే గానీ నూటికి పది మందికే ఇవి ఉపయోగపడుతున్నాయి. మిగతావారి సంగతేంటి? ఇలాంటివారి కోసమే బేరియాట్రిక్ శస్త్రచికిత్సలు పుట్టుకొచ్చాయి. ఇవీ అందరికీ చేయటం కుదరదు. చాలామంది శస్త్రచికిత్సల మాట వినగానే బెంబేలెత్తి పోతుంటారు కూడా. ఈ నేపథ్యంలో మధ్యేమార్గంగా ఎండోస్కోపిక్ బేరియాట్రిక్ పద్ధతులు సరికొత్త ఆశలు రేపుతున్నాయి.

ఊబకాయం పెద్ద సమస్య. దీంతో మధుమేహం ముప్పు పెరుగుతుంది. మధుమేహం మరింత తీవ్రమవుతుంది కూడా. రోజురోజుకీ వీటి బారినపడుతున్నవారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. జాతీయ కుటుంబ ఆరోగ్య గణన ప్రకారం.. తెలంగాణలో 41.7% మంది మగవారు, 40.2% మంది మహిళలు అధిక బరువు లేదా ఊబకాయం గలవారే. ఆంధ్రప్రదేశ్‌లోనైతే 44.4% మంది మగవారు, 37.7% మంది మహిళలు వీటితో సతమతమవుతున్నారు. అంతేకాదు.. పెద్దవారిలో సుమారు 20% మంది మధుమేహంతోనూ బాధపడుతున్నారు. ఊబకాయానికీ మధుమేహానికీ ప్రత్యక్ష సంబంధం ఉంటుండటం.. ఇవి రెండూ గలవారికి గుండెజబ్బులు, కాలేయానికి, క్లోమానికి కొవ్వు పట్టటం, అవయవాల చుట్టూ కొవ్వు పేరుకోవటం, కీళ్లు అరగటం, స్తంభన లోపం వంటి సమస్యల ముప్పు పెరుగుతుండటం వల్ల బరువు తగ్గించుకోవటం తక్షణ ప్రాధాన్యంగా మారిపోయింది. కనీసం 10% బరువు తగ్గినా సమస్యలను చాలావరకు తగ్గించుకోవచ్చు. ఇందుకు నిన్న మొన్నటి వరకు జీవనశైలి మార్పులు తప్ప మరో మార్గం కనిపించేది కాదు. వీటితో ఫలితం కనిపించకపోతే ఇక అంతే అనుకునేవారు. బరువును తగ్గించే బేరియాట్రిక్ శస్త్రచికిత్సలు అందుబాటులోకి రావటంతో కొత్త ఆశలు చిగురించాయి. అయితే శస్త్రచికిత్సలు చాలామందికి అనువైనవి కాకపోవటం, వీటిని చేయించుకోవటానికి భయపడటం పెద్ద అవరోధంగా మారింది. ఇలాంటి ఇబ్బందులను తప్పించటానికి ఎండోస్కోపిక్ పద్ధతిలో చేసే చికిత్సలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. వీటి ఉద్దేశం- పొట్ట మీద ఎలాంటి కోత పెట్టకుండానే లోపల్నుంచే జీర్ణాశయ పరిమాణాన్ని తగ్గించటం, పేగుల పనితీరును మార్చటం.

**రెండు పద్ధతులు..**

బేరియాట్రిక్ ఎండోస్కోపీ పద్ధతులను జీర్ణాశయానికే పరిమతమయ్యేవి, పేగుల పనితీరును మార్చేవి.. ఇలా రెండు రకాలుగా విభజించుకోవచ్చు. జీర్ణాశయానికి చేసే చికిత్సలు బరువు తగ్గటానికి.. చిన్నపేగుల్లో చేసే చికిత్సలు మధుమేహం అదుపులోకి రావటానికి తోడ్పడతాయి.

**1. జీర్ణాశయ చికిత్సలు**

తిండి తగ్గితే బరువు తగ్గుతుంది. ఇది అందరికీ తెలిసిందే. ఆ విషయం తెలిసినా తిండి తగ్గించుకోలేకపోతే? జిహ్వా చాపల్యాన్ని ఆపుకోలేకపోతే? ఇలాంటివారి కోసం పురుడు పోసుకున్నవే జీర్ణాశయ పరిమాణాన్ని తగ్గించే చికిత్సలు.

బుడగ అమర్చటం (ఇంట్రాగ్యాస్ట్రిక్ బెలూన్) జీర్ణాశయంలో బెలూన్‌ను ప్రవేశపెట్టి, తిండిని తగ్గించేలా చేయటం దీని ప్రత్యేకత. బెలూన్లలో ఓర్బెరా, ఓబలాన్, ట్రాన్స్‌పైలోరిక్ వంటి రకాలున్నాయి. బెలూన్‌ను ఎక్కడ ఉంచాలి? ఎప్పుడు తీయాలి? అనే దాన్ని బట్టి ఎవరికేది ఉపయోగపడుతుందన్నది నిర్ణయిస్తారు. అవసరమైతే రెండు, మూడు బెలూన్లు ప్రవేశపెట్టొచ్చు. ఓర్బెరా బెలూన్‌ను లోపలికి పంపించాక, దాన్ని చేరుకొని సెలైన్ ద్రావణంతో నింపుతారు. ఓబలాన్ బెలూన్ మాత్రలా ఉంటుంది. దీనికి ఒకవైపున సన్నటి గొట్టం ఉంటుంది. ముందు గొట్టాన్ని పట్టుకొని మాత్రను మింగిస్తారు. అల్ట్రాసౌండ్ పరీక్షలో చూస్తూ జీర్ణాశయంలో అవసరమైన చోట కుదురుకునేలా చేస్తారు. ఇది స్థిరపడ్డాక గొట్టం ద్వారా బెలూన్‌లోకి గాలిని నింపుతారు. అవసరమైతే ప్రతి నాలుగు వారాలకు ఒకటి చొప్పున ఇలాంటి బెలూన్లను మూడు వరకు అమరుస్తారు. ట్రాన్స్‌పైలోరిక్ బెలూన్ అయితే కొద్దిగా మత్తుమందు ఇచ్చి అమర్చాల్సి ఉంటుంది. ఇందులో పెద్ద బెలూన్‌కు మరో చిన్న బెలూన్ అనుసంధానంగా ఉంటుంది. ఎండోస్కోప్ ద్వారా దీన్ని లోపలికి పంపించి, సెలైన్ ద్రావణంతో నింపుతారు. పెద్ద బెలూన్ జీర్ణాశయంలోనే ఉంటుంది. చిన్న బెలూన్ అక్కడే ఉండొచ్చు లేదూ చిన్నపేగులోకి జారిపోవచ్చు. ఈ ప్రక్రియ 15-30 నిమిషాల్లోనే పూర్తవుతుంది. కొద్ది గంటల్లోనే ఇంటికి వెళ్లిపోవచ్చు. పద్ధతి ఏదైనా బెలూన్ చేసే పని ఒక్కటే. జీర్ణాశయం పరిమాణాన్ని తగ్గించటం. దీంతో కొంచెం తినగానే కడుపు నిండిన భావన కలుగుతుంది. తిండి తక్కువగా తినటం వల్ల బరువు తగ్గుతుంది. గ్లూకోజూ అదుపులోకి వస్తుంది.

శరీర ఎత్తు, బరువుల నిష్పత్తి (బీఎంఐ) 30-40 గలవారికి, జీవనశైలి మార్పులను కచ్చితంగా పాటించటానికి అంగీకరించినవారికి బెలూన్ చికిత్స చేస్తారు. ఇంతకుముందు జీర్ణాశయ, అన్నవాహిక సర్జరీలేవీ చేయించుకొని ఉండకూడదు కూడా. సాధారణంగా బెలూన్‌ను ఏడాది దాటాక తీస్తారు.

**లోపల్నుంచి కుట్టటం (స్లీవ్ గ్యాస్ట్రోప్లాస్టీ)**

జీర్ణాశయాన్ని కత్తిరించకుండా లోపల్నుంచే కుట్లు వేసి, సైజు తగ్గించటం దీనిలోని కీలకాంశం. ముందుగా స్వల్పంగా మత్తుమందు ఇచ్చి, నోటి ద్వారా ఎండోస్కోపీని జీర్ణాశయంలోకి పంపిస్తారు. తర్వాత ఒంపు తిరిగి ఉండే జీర్ణాశయం వైపున లోపల్నుంచే అధునాతన పరికరంతో కుట్లు వేస్తారు. దీంతో జీర్ణాశయం గొట్టం మాదిరిగా, అరటిపండు ఆకారంలోకి మారుతుంది. జీర్ణాశయం సైజు సుమారు 70-80% వరకు తగ్గిపోతుంది. అందువల్ల కొంచెం తినగానే కడుపు నిండుతుంది. జీర్ణాశయం కేలరీలు గ్రహించుకోవటమూ తగ్గుతుంది. ఆహారం ఎక్కువసేపు అక్కడే ఉండటం వల్ల చాలాసేపు ఆకలి వేయకుండానూ ఉంటుంది. ఇవన్నీ బరువు, గ్లూకోజు తగ్గటానికి తోడ్పడతాయి.

బేరియాట్రిక్ సర్జరీ సరిపడనివారు, సర్జరీ ఇష్టం లేనివారు దీన్ని చేయించుకోవచ్చు. 18 ఏళ్లు పైబడి, బీఎంఐ 30 కన్నా ఎక్కువగా ఉండేవారికే దీన్ని చేస్తారు. బెలూన్‌తో పోలిస్తే ఇది దీర్ఘకాలం.. 4-5 ఏళ్ల వరకు బరువు అదుపులో ఉండేలా చేస్తుంది. కుట్లు జీవితాంతం ఉన్నా ఏమీ కాదు. దుష్ప్రభావాలేవీ ఉండవు. జీర్ణాశయం స్వభావం, పనితీరు ఏమీ మారదు. పోషకాల లేమి తలెత్తదు.

**2. చిన్నపేగు చికిత్సలు**

ఇవి ప్రధానంగా మధుమేహం కోసం ఉద్దేశించినవి. మనం తిన్న ఆహారం జీర్ణమై, అందులోని పోషకాలు ఒంట బట్టటానికి చిన్నపేగు కీలకం. గ్లూకోజు స్థాయులను తగ్గించే జీఎల్‌పీ-1 వంటి హార్మోన్లు ఇందులోనే ఉత్పత్తి అవుతుంటాయి. నిజానికి చిన్నపేగు మొత్తం ఒకటే అయినా పోషకాలను గ్రహించుకోవటంలో ఒకో భాగం ఒకోలా ఉపయోగపడుతుంది. దీన్ని డియోడినం (తొలిభాగం), జెజునం (మధ్యభాగం), ఇలియం (చివరిభాగం) అని మూడు భాగాలుగా విభజించుకోవచ్చు. ఇవి జీవక్రియల్లో వేర్వేరు పనులను నిర్వర్తిసుంటాయి. అందుకే మధుమేహ నియంత్రణలో ఇప్పుడు చిన్నపేగు మీదే ఎక్కువ దృష్టి కేంద్రీకరిస్తున్నారు. మున్ముందు మధుమేహ చికిత్సలో ఇలాంటి శస్త్రచికిత్స పద్ధతులే ప్రధానం కానున్నాయి.

**పేగులో గొట్టం (డియోడినల్-జెజునల్ బైపాస్ లైనర్)**

దీన్ని డియోడినల్ స్లీవ్ అనీ అంటారు. తిన్న ఆహారాన్ని చిన్నపేగు తొలిభాగం, మధ్యభాగం మొదట్లో జీర్ణం కాకుండా చేయటం దీని ఉద్దేశం. ఎండోస్కోప్ ద్వారా మృదువైన, పలుచటి పొరతో కూడిన గొట్టంలాంటి పరికరాన్ని (ఎండోబ్యారియర్) చిన్నపేగు మొదట్లో అమర్చటం ఇందులోని కీలకాంశం. పరికరం సుమారు 60 సెంటీమీటర్ల పొడవుంటుంది. కిరీటంలా ఉండే దీని తలభాగాన్ని జీర్ణాశయం అడుగున బిగించి, కింది భాగాన్ని చిన్నపేగులో జెజునం మధ్యలోకి జారవిడుస్తారు. తర్వాత రంగు ద్రవాన్ని లోపలికి పంపించి పరికరం సరిగా కుదురుకుందో లేదో చూస్తారు. ఎండోబ్యారియర్ మూలంగా జీర్ణాశయంలో ముద్దగా మారిన ఆహారం డియోడినం, జెజునం తొలిభాగంలో జీర్ణం కాకుండానే కిందికి వెళ్లిపోతుంది. ఫలితంగా పేగులు పోషకాలు గ్రహించుకోవటం తగ్గుతుంది. ఇన్సులిన్ ఉత్పత్తిని ప్రేరేపించే జీఎల్‌పీ-1 హార్మోన్ స్థాయులు పెరగటానికీ ఇది తోడ్పడుతుంది. ఇలా రక్తంలో గ్లూకోజు స్థాయులు తగ్గేలా చేస్తుంది. జీఎల్‌పీ-1 హార్మోన్ మెదడు మీదా ప్రభావం చూపుతుంది. కడుపు నిండిన భావన కలిగించి, బరువు తగ్గటానికి దోహదం చేస్తుంది.

మధుమేహం నియంత్రణలో లేని ఊబకాయులకు, బేరియాట్రిక్ సర్జరీ సరిపడనివారికి, భారీ ఊబకాయులకు, ఇతరత్రా శస్త్రచికిత్సల కోసం గ్లూకోజు మోతాదులు తగ్గించుకోవాలని అనుకునేవారికిది బాగా ఉపయోగపడుతుంది. ఇది గంటలోనే పూర్తయ్యే చికిత్స. అదే రోజు ఇంటికి వెళ్లిపోవచ్చు. గొట్టాన్ని ఆరు నెలల తర్వాత తొలగించొచ్చు. కావాలంటే ఏడాది వరకు కొనసాగించొచ్చు. అవసరమైతే మార్చి, కొత్తది వేసుకోవచ్చు. దీంతో రక్తంలో మూడు నెలల గ్లూకోజు సగటును తెలిపే హెచ్‌బీఏ1సీ 1.5-2% వరకు తగ్గుతున్నట్టు అధ్యయనాలు చెబుతున్నాయి. బరువు కూడా 10-12% వరకు తగ్గటం విశేషం.

**జిగురుపొరను సరిదిద్దటం (డియోడినల్ మ్యూకోజల్ రీసర్ఫేసింగ్)**

మధుమేహంతో బాధపడేవారిలో చిన్నపేగు తొలిభాగంలోని జిగురుపొర (మ్యూకస్) మందంగా తయారవుతుంది. దీంతో గ్లూకోజు మోతాదులను నియంత్రించే హార్మోన్ల ఉత్పత్తి తగ్గుతుంది. దెబ్బతిన్న పొరను తొలగించి, పునరుత్తేజితం చేస్తే గ్లూకోజు స్థాయులూ నియంత్రణలోకి వస్తాయి కదా. డియోడినల్ మ్యూకోజల్ రీసర్ఫేసింగ్ (డీఎంఆర్) చేసే పని ఇదే. ఇందులో ముందుగా నోటి ద్వారా డియోడినంలోకి ఎండోస్కోప్‌ను పంపిస్తారు. అనంతరం జిగురుపొరలోకి సెలైన్ ద్రావణాన్ని ఎక్కించి, ఇతర పొరలు వేరయ్యేలా చేస్తారు. ఎండోస్కోప్ ద్వారా మరో ప్రత్యేక గొట్టాన్ని పంపిస్తారు. దీని చివర ఉండే వేడి బెలూన్ సాయంతో మందంగా మారిన జిగురుపొరను కాల్చేస్తారు. కొంత కాలానికి అక్కడ కొత్త జిగురుపొర పుట్టుకొస్తుంది.

**జిగురుపొరను కాల్చటం పునరుత్తేజితమైన జిగురుపొర**

మందులతో గ్లూకోజు నియంత్రణలో రానివారికిది సురక్షితమైన, సమర్థమైన చికిత్స అనుకోవచ్చు. దీంతో హెచ్‌బీఏ1సీ 1.5-2% వరకు తగ్గుతుంది. ఒక మాదిరి మధుమేహం గలవారికి మందుల అవసరం తప్పుతున్నట్టు, మధుమేహం మరీ ఎక్కువగా గలవారు మందుల మోతాదులు తగ్గించుకుంటున్నట్టు న్నట్టు అధ్యయనాలు చెబుతున్నాయి. దీన్ని చేయించుకున్నాక అదే రోజు ఇంటికి వెళ్లిపోవచ్చు. కాకపోతే ఇది తాత్కాలిక ప్రక్రియ. అవసరమైతే ఆర్నెళ్లకోసారి చేయాల్సి ఉంటుంది. మనదేశంలో దీన్ని ప్రయోగాత్మకంగానే చేస్తున్నారు.

**జాగ్రత్తలు పాటించటం తప్పనిసరి**

బరువు, మధుమేహ చికిత్సలు చేయించుకున్నాక తొలి వారంలో ద్రవాలు మాత్రమే తీసుకోవాల్సి ఉంటుంది. లి 2-3 వారాల వరకు ద్రవాలతో పాటు మెత్తటి పదార్థాలు తినొచ్చు. లి 4వ వారం నుంచి రోజువారీ ఆహారం తీసుకోవచ్చు గానీ కేలరీలు తక్కువగా లభించేలా చూసుకోవాలి. లి ఆ తర్వాత కూడా ఆహార, వ్యాయామ నియమాలు కచ్చితంగా పాటించాలి.

# పుచ్చపండు లాంటి ఆరోగ్యం!



ఎండకాలం వస్తోందనగానే అందరి చూపు పుచ్చపండ్ల మీదికి మళ్లుతుంది. ఎర్రటి గుజ్జుతో కూడి, చూడగానే నోరూరించే వీటిల్లో నీటిశాతం చాలా ఎక్కువ. సుమారు 95% వరకూ నీరే ఉంటుంది. పుచ్చపండులో బీటా కెరొటిన్, విటమిన్ సి వంటి పోషకాలు దండిగా ఉంటాయి. ఇవి యాంటీఆక్సిడెంట్లుగానూ పనిచేస్తాయి. అంటే రోగనిరోధకశక్తి పెంపొందటానికి తోడ్పడతాయన్నమాట. పుచ్చపండు మాత్రమే కాదు.. తీయ దోస (హనీడ్యూ), ఖర్బూజా (క్యాంటలోప్) సైతం దీని కోవకు చెందినవే. ఖర్బూజాను ఒక ముక్క (80 గ్రాములు) తిన్నా ఆ రోజుకు అవసరమైన విటమిన్ సి, విటమిన్ ఎ మోతాదులో సగం వరకు లభిస్తాయి. వీటిల్లోని పోషకాలు మన ఆరోగ్యానికి ఎలా ఉపయోగపడతాయో చూద్దామా. కంటి చూపు మెరుగు: పుచ్చపండు గుజ్జు ఎర్రటి రంగులో ఉండటానికి కారణం బీటా కెరొటిన్. ఇది చర్మం, ఎముకలు ఆరోగ్యంగా ఉండటానికి చాలా ముఖ్యం. వయసు పెరుగుతున్నకొద్దీ కంట్లోని రెటీనా మధ్యభాగం క్షీణించటం మూలంగా చూపు తగ్గిపోయే సమస్యనూ ఇది నివారిస్తుంది. ఖర్బూజాలోని ల్యూటీన్, జియాగ్జాంతీన్ సైతం కంటి ఆరోగ్యానికి ఎంతగానో ఉపయోగపడతాయి. రక్త ప్రసరణ ఉత్తేజం: పుచ్చపండు గుజ్జు, తొక్కలో సిట్రులిన్ అనే అమైనో ఆమ్లం దండిగా ఉంటుంది. ఇది నైట్రిక్ ఆక్సైడ్ ఉత్పత్తయ్యేలా ప్రేరేపిస్తుంది. ఫలితంగా రక్తనాళాలు విప్పారతాయి. అవయవాలకు రక్త ప్రసరణ మెరుగవుతుంది.

**రక్తపోటు అదుపు:** పొటాషియం మూత్రం ఎక్కువ వచ్చేలా చేస్తుంది. దీంతో రక్తపోటు తగ్గుముఖం పడుతుంది. అందువల్ల పొటాషియం తగినంతగా లభించాలంటే పుచ్చపండు తింటే సరి. ఇలా రక్తపోటు అదుపులో ఉండేలా చేసుకోవచ్చు. మరోవైపు దీనిలోని లైకోపేన్ గుండెజబ్బు ముప్పు తగ్గటానికీ తోడ్పడుతుంది.

**పుండ్లు మాన్పుతుంది:** ఆర్జినైన్ అనే అమైనో ఆమ్లం ఉత్పత్తి కావటంలో పుచ్చపండులోని సిట్రులిన్ పాలు పంచుకుంటుంది. ఆర్జినైన్ రోగనిరోధక వ్యవస్థను ఉత్తేజితం చేస్తుంది. అలాగే పుండ్లు త్వరగా మానటానికీ దోహదం చేస్తుంది.

**విషతుల్యాలు పోగొడుతుంది:** పుచ్చపండులో నీరు ఎక్కువగా ఉంటుంది కదా. పైగా ఇందులో ఖనిజాల పాళ్లు మెండు. అలాగే ఒంట్లో ఆమ్ల స్వభావాన్నీ తగ్గిస్తుంది. మూత్రం ఎక్కువగా వచ్చేలా చేస్తుంది. అందువల్ల ఒంట్లో పేరుకుపోయిన విషతుల్యాలు పోగొట్టుకోవాలని భావించేవారికిది ఎంతగానో ఉపయోగపడుతుంది.

**తక్షణ శక్తి:** పుచ్చపండు తేలికగా జీర్ణమవుతుంది. మంచి పిండి పదార్థాలు సైతం ఉండటం వల్ల తక్షణ శక్తినిస్తుంది. అందువల్ల నీరసం, నిస్సత్తువ వంటివి వెంటనే తగ్గుతాయి. మానసికంగానూ మంచి హుషారు, ఉత్సాహం చేకూరుతాయి.

**పలుకులూ మేలే:** పుచ్చకాయ గింజల్లోని పలుకుల్లో ఉండే ఆరోగ్యకరమైన అసంతృప్త కొవ్వులు సైతం మేలు చేసేవే. వీటిల్లో పీచు కూడా ఎక్కువగానే ఉంటుంది. ఇవన్నీ గుండె ఆరోగ్యాన్ని ఇనుమడింపజేసేవే.

# ఎందుకీ నోటిపూత? సమస్య-సలహా



సమస్య: నేను గత 3 నెలలుగా నోటిపూతతో బాధపడుతున్నాను. ఏమాత్రం కారం తగిలినా నొప్పి, మంట పుడుతున్నాయి. రైబోఫ్లావిన్ మాత్రలు వాడాను. పెద్దగా ఫలితం లేదు. దీనికి కారణాలేంటి? పరిష్కారమేంటి?

సలహా: నోటిపూత (ఆఫ్తస్ అల్సర్లు) తరచూ చూసే సమస్యే. నాలుక, బుగ్గలు, పెదాల మీద ఎక్కడైనా పుండ్లు పడొచ్చు. కొందరికి చిగుళ్ల మీదా ఏర్పడొచ్చు. ఇవి చిన్నవే అయినా బాగా ఇబ్బంది కలిగిస్తాయి. ఏం తిన్నా నొప్పి, మంట వేధిస్తాయి. మీలాగే చాలామంది నోటిపూతకు ప్రధాన కారణం బి విటమిన్ల లోపమే అనుకుంటుంటారు. రైబోఫ్లావిన్ వంటి మాత్రలు కొనుక్కొని వేసుకుంటుంటారు. నిజానికివి ఎందుకు ఏర్పడతాయన్నది కచ్చితంగా తెలియదు. బి విటమిన్ల లోపంతో నోటిపూత రావటం అరుదనే అనుకోవచ్చు. దీనికి రకరకాల అంశాలు దోహదం చేయొచ్చు. కొందరికి మానసిక ఒత్తిడితో రావొచ్చు. ఇలాంటి పుండ్లు విద్యార్థుల్లో.. ముఖ్యంగా యుక్తవయసులో ఎక్కువగా చూస్తుంటాం. బుగ్గలు, పెదాల లోపలి భాగం పొరపాటున పండ్ల కింద పడటంతోనూ పుండ్లు ఏర్పడొచ్చు. కొన్నిరకాల వైరల్ ఇన్‌ఫెక్షన్లు.. ముఖ్యంగా హెర్పిస్ మూలంగానూ పుండ్లు ఏర్పడొచ్చు. కొందరికి సోడియం లారిల్ సల్ఫేట్‌తో కూడిన టూత్‌పేస్ట్, మౌత్‌వాష్‌లతోనూ తలెత్తొచ్చు. కాఫీ, గుడ్లు, ఛీజ్, మసాలాలు, పుల్లటి పదార్థాలు పడకపోవటమూ కారణం కావొచ్చు. జీర్ణాశయంలో పుండ్లకు దారితీసే హెలికోబ్యాక్టర్ పైలోరీ బ్యాక్టీరియా మూలంగానూ ఇవి ఏర్పడొచ్చు. సీలియాక్ డిసీజ్, క్రాన్స్, అల్సరేటివ్ వంటి జబ్బులూ దీనికి దారితీయొచ్చు. ల్యూపస్ వంటి స్వీయరోగనిరోధక సమస్యలతో బాధపడేవారిలోనూ చూస్తుంటాం.

మామూలుగానైతే నోటిపూత వారం, రెండు వారాల్లో దానంతటదే తగ్గుతుంది. పెద్దగా మందుల అవసరమేమీ ఉండదు. మీరు పుండ్లు ఎలా ఉన్నాయన్నది తెలియజేయలేదు. ఒకవేళ పుండ్లు పెద్దగా ఉన్నా, తరచూ వస్తున్నా, రెండు వారాలు దాటినా తగ్గకపోతున్నా, పుండ్లు పెదాల చివర్ల వరకు విస్తరిస్తున్నా, భరించలేని నొప్పి వస్తున్నా, పుండ్లతో పాటు జ్వరం వస్తున్నా చికిత్స అవసరమవుతుంది.

మీకు ఇలాంటి లక్షణాలేవైనా ఉంటే దగ్గర్లోని జనరల్ ఫిజిషియన్‌ను సంప్రదించటం మంచిది. కారణాలను విశ్లేషించి తగు చికిత్స చేస్తారు. మీకు ఏవైనా పదార్థాలు పడకపోతే వాటిని తినకపోవటం, పండ్లు కూరగాయలు ఎక్కువగా తినటం, నోటిని శుభ్రంగా ఉంచుకోవటం, ఒత్తిడిని తగ్గించుకోవటం, కంటి నిండా నిద్రపోవటం ద్వారా వీటిని నివారించుకోవచ్చు.

# ఐక్యూఏసి సమావేశ మందిరం శ్రేష్ట ప్రారంభం



ఆంధ్రవిశ్వవిద్యాలయం **(విజయభాను న్యూస్) :** ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇంటర్నల్ క్వాలిటీ ఎష్యూరెన్స్ సెల్ (ఐక్యూఏసి)లో నూతన సమావేశ మందిరం(బోర్డ్ రూమ్)-శ్రేష్ట ని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి మంగళవారం ఉదయం ప్రారంభించారు. ఆధునిక వసతులతో సమావేశాల నిర్వహణకు ఉపయుక్తంగా దీనిని ఏర్పాటు చేసారు. వివిధ సంస్థలు, ప్రతినిధులు తరచూ ఏయూ ఐక్యూఏసి కార్యాలయాన్ని సందర్శిస్తుంటారు. వీరితో చర్చించడానికి ఉపయుక్తంగా ఆధునిక వసతులతో సమావేశమందిరాన్ని ఏర్పాటు చేసారు. ప్రత్యేకంగా ప్రజెంటేషన్ ఇవ్వడానికి, వర్సిటీ వనరులు, వసతులు, సామర్థ్యాలు, ప్రగతి వంటి విభిన్న అంశాలను నిపుణులకు, కమిటీల ప్రతినిధులకు వివరించడానికి ఎంతో ఉపయుక్తంగా ఈ సమావేశ మందిరం నిలచే విధంగా ఆధునికత ఉట్టిపడే విధంగా దీనిని సుందరంగా తీర్చిదిద్దారు. కార్యక్రమంలో ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత, ఓఎస్డి ఆచార్య వి.కృష్ణమోహన్, ప్రిన్సిపాల్స్ ఆచార్య కె.శ్రీనివాస రావు, వై.రాజేంద్ర ప్రసాద్, టి.శోభశ్రీ, ఎస్.కె భట్టి, వి.విజయలక్ష్మి, పాలక మండలి సభ్యురాలు ఆచార్య పి.సునీత, ఐక్యూఏసి కోఆర్డినేటర్ ఆచార్య డి.లలిత భాస్కరి, ఆచార్యులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## భారత్‌ను ఓడించడం కత్తిమీద సామే.. : రికీ పాంటింగ్

వన్డే ప్రపంచ కప్‌లో హ్యాట్రిక్ విజయాలు సాధించి పాయింట్ల పట్టికలో భారత్ అగ్రస్థానంలో నిలిచింది. తొలుత ఆసీస్‌పై అద్భుత పోరాటంతో గెలిచిన టీమ్‌ఇండియా.. ఆ తర్వాత అఫ్గాన్, పాక్‌ను అలవోకగా చిత్తు చేసింది. ఈ క్రమంలో భారత్‌ను ఓడించడమంటే ఇతర జట్లకు చాలా కష్టమని ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ వ్యాఖ్యానించాడు. స్వదేశంలో జరుగుతుండటం వారికి కలిసొస్తోందని.. అలాగే బలమైన జట్టుతో బరిలోకి దిగడం కూడా భారత్‌కు సానుకూలాంశంగా పేర్కొన్నాడు. అయితే, టోర్నీ ముందుకు సాగే కొద్దీ టీమ్‌ఇండియాకూ ఒత్తిడి తప్పదని.. ఎలా అధిగమిస్తుందనేది కీలకమని పాంటింగ్ తెలిపాడు.

"వరల్డ్ కప్ ప్రారంభానికి ముందు నుంచే నేను చెబుతున్నా. భారత్‌ను ఓడించడమంటే చాలా కష్టం. అద్భుతమైన ఆటగాళ్లతో బరిలోకి దిగింది. అన్ని విభాగాలను పటిష్ఠంగా మలుచుకుంది. ఫాస్ట్, స్పిన్ బౌలింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు.


# జిసిసి సహజ ఉత్పత్తుల మార్కెట్ ను మరింత విస్తృతం

### జిసిసి నూతన వెబ్ సైట్ ను ప్రారంభించిన డిప్యూటీ సిఎం & గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పి. రాజన్నదొర



విశాఖపట్నం **(విజయభాను న్యూస్) :** గిరిజనులు, వినియోగదారులు, ఉద్యోగులకు అవసరమైన శ్రీఘ్ర సేవలు, సమగ్ర సమాచారాన్ని అందించడంతో పాటు జిసిసి సహజ ఉత్పత్తుల మార్కెట్ ను మరింత విస్తృతం చేసేందుకు గిరిజన సహకార సంస్థ (జిసిసి) నూతన వెబ్ సైట్ దోహదపడుతుందని ఎపి డిప్యూటి సిఎం పీడిక రాజన్నదొర అన్నారు. గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో జరిగిన కార్యక్రమలో జిసిసి నూతన వెబ్ సైట్ ను రాజన్నదొర బటన్ నొక్కి ప్రారంభించారు. గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి కాంతిలాల్ దాండే, గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ జే.మురళి, జిసిసి వైస్ చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ జి.సురేష్ కుమార్, ట్రైకార్ ఎం.డి. రవీంద్రబాబు, గిరిజన సంక్షేమ శాఖ ఇంజినీరింగ్ చీఫ్ శ్రీనివాస్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటి సిఎం రాజన్నదొర మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి సారధ్యంలో గత నాలుగేళ్ళలో గిరిజనుల సాధికారత సాధనలో జిసిసి అన్యూహ్యమైన, మంచి ఫలాలను గిరిజనులకు అందించిందని అన్నారు. జిసిసి గిరిజనుల నుంచి అటవీ, వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలు చేసి హోల్ సేల్, రిటైల్ మార్కెట్ లో విక్రయించడంతో పాటు గిరిజనులకు డి.ఆర్.డిపోల ద్వారా రేషన్ సరుకుల సరఫరా, పెట్రోలు బంకుల ఏర్పాటు, వివిధ రాష్ట్రాల్లో రిటైల్ అవుట్ లెట్ల ద్వారా ఉత్పత్తుల విక్రయాలు, వన్ ధన్ వికాస కేంద్రాల ఏర్పాటు, అరకు వ్యాలీ కాఫీకి అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావడంలో విశేషమైన కృషి చేస్తూ సత్ఫలితాలను సాధిస్తుందని అన్నారు. ఈ ఫలితాల సాధనలో కృషి చేసిన జిసిసి, గిరిజన సంక్షేమ శాఖ సిబ్బందికి అభినందనలు తెలియజేసారు.

గిరిజన కోఆపరేటివ్ కార్పొరేషన్ (జిసిసి) 2022-23లో తన ప్రధాన కార్యకలాపాల ద్వారా రూ.494.25 కోట్లను గిరిజన ఆర్థిక వ్యవస్థలోకి పంపింది. రూ.75.56 కోట్ల అటవీ మరియు వ్యవసాయ ఉత్పతుల కొనుగోలు చేయడం జరిగినది. ఇంత స్థాయిలో గిరిజన ఆర్థిక, సామాజిక అభివృద్ధికి గాను గిరిజన సంక్షేమ శాఖ నేతృత్వంలో జిసిసి చేస్తున్న కార్యక్రమాలను సమగ్రంగా అందుబాటులోకి తీసుకురావడంతో పాటు జిసిసి సహజ ఉత్పత్తుల మార్కెట్ ను మరింతగా విస్తరించేందుకు ఈ వెబ్ సైట్ విశేషంగా దోహదపడగలదని రాజన్నదొర ఆశాభావం వ్యక్తం చేసారు. జిసిసి వైస్ చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ జి.సురేష్ కుమార్ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో జిసిసి అందిస్తున్న సేవలు, ఖర్చు పెడుతున్న నిధులు, ప్రణాళికలు, ఫలితాలు వంటి వివరాలు అన్ని గణాంకాలతో సహా నూతన వెబ్ సైట్ లో పొందుపరచడం జరిగిందని చెప్పారు. జిసిసి గిరిజన ప్రాంతాల్లో సేకరించిన ముడి సరుకులతో పారిశ్రామిక యూనిట్లలో తయారుచేసి మార్కెట్ లోకి విడుదల చేస్తున్న సహజ ఉత్పత్తుల ఆన్ లైన్ ద్వారా కొనుగోలు చేసే ఆన్ లైన్ షాపింగ్ తో పాటు సోషల్ మీడియా వేదికలను ఈ నూతన వెబ్ సైట్ తో అనుసంధానించామని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వున్న జిసిసి ప్రధాన కార్యాలయంతో సహా ప్రాంతీయ కార్యాలయాలు, ఉద్యోగుల వివరాలను సమగ్రంగా అందుబాటులో వుంచడంతో పాటు, పారదర్శకత, జవాబుదారీతనం పెంచే చర్యల్లో భాగంగా జిసిసి సిబ్బంది బదిలీలు, ఉత్తర్వుల వివరాలతో పాటు టెండర్లు, నోటీసులు, ప్రకటనలు సమగ్రంగా ఈ వెబ్ సైట్ లో అందుబాటులో ఉంటాయని వివరించారు.



# మత్స్యకార కార్పోరేషన్ చైర్మన్ గా బాధ్యతలు చేపట్టిన పేర్ల విజయ చందర్



అమరావతి(విజయభాను న్యూస్): రాష్ట్ర మత్స్యకార కార్పోరేషన్ చైర్మన్ గా పేర్ల విజయ చందర్ మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఉత్తరాంధ్ర ప్రాంతీయ సమన్వయకర్త వై వి సుబ్బారెడ్డి,ఎంపీ మోపిదేవి వెంకటరమణ, రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్నాథ్,విశాఖపట్నం పార్లమెంటు సభ్యులు, వైసిపి తూర్పు సమన్వయకర్త యం.వి.వి.సత్యనారాయణ ఆశీస్సులతో విజయవాడ గొల్లపూడి బి.సి భవనంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి సిదిరి అప్పలరాజు, విశాఖ జిల్లా పార్టీ అధ్యక్షులు కోలా గురువులు హాజరయ్యారు. రాష్ట్ర మత్స్యకార కార్పోరేషన్ చైర్మన్ గా పేర్ల విజయ చందర్ పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమములో రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ డైరెకటర్లు, వంగరి సుమతి, తిరుపతియ్య, జ్యోతి, ఎస్సీ విభాగం జోనల్ ఇంఛార్జి అల్లంపల్లి రాజుబాబు, పార్టీ ముఖ్య నాయకులు ఆకుల శ్రీనివాసరావు, యనమరెడ్డి వేంకటరెడ్డి, కాగితాల లక్ష్మణరెడ్డి, బీ.సీ ఆఫీస్ ఏం.డి బీమశంకరరావు, కో ఆర్డనేటర్ ప్రవీణ్ పాల్గొని అభినందనలు తెలియజేశారు.

# గీతం వేధికగా ఎన్.ఎ.పి. 33వ వార్షిక సమావేశాలు

### మానసిక పరిశోధకులకు ఆహ్వానం

సాగర్‌నగర్ **(విజయభాను న్యూస్) :** గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా నేషనల్ అకాడమి ఆఫ్ సైకాలజీ (ఎన్.ఎ.పి) 33వ వార్షిక సమావేశాలకు 2024 ఫిబ్రవరి నెలలో నిర్వహిస్తున్నట్లు గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ డైరక్టర్ ప్రొఫెసర్ చిన్నయ సూరి తెలిపారు. సమాజ సుస్థిర అభివృద్ధిలో మానసిక అంశాల పాత్రపై పరిశోధకులు ఈ సమావేశాలలో విస్తృత చర్చలు జరుపుతారని పేర్కొన్నారు. డవలప్‌మెంటల్ సైకాలజీ, సోషల్ సైకాలజీ, కాగ్నిటివ్ సైకాలజీ, ఆర్గనైజేషనల్ బిహేవియర్, ఇండియన్ సైకాలజీ, క్లీనికల్ మరియు హెల్త్ సైకాలజీ, మిలటరీ సైకాలజీ, జెరోసైకాలజీ, సైబర్ సైకాలజీ అంశాలలో పరిశోధకులు తమ పరిశోధనా పత్రాలను ఈ ఏడాది నవంబర్ 15వ తేదీలోగా పంపవలసి ఉంటుందన్నారు. అలాగే ఈ సమావేశాలకు ముందుగా తమ తమ ప్రాంతాలలో వర్క్‌షాప్‌లను నిర్వహించదలచిన వారు వివరాలను 33naop@gitam.edu మెయిల్‌కు పంపవలసిందని సూచించారు. ఈ సమావేశాలలో ప్రతినిధులుగా పాల్గొన దలచినవారు ఈ ఏడాది డిసెంబర్ 28వ తేదీలోగా వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి సమాచారం కోసం సమావేశాలు వెబ్‌సైట్ naop33.gitam.edu.పరిశీలించాల్సిందిగా సూచించారు.

# ప్రజలందరికి అందుబాటులో ఆరోగ్య సేవలు

### ఇన్-చార్జ్ మంత్రివర్యులు విడదల రజిని

విశాఖపట్నం **(విజయభాను న్యూస్) :** UPHC బక్కన్నపాలెం లో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంను వైద్య ఆరోగ్య శాఖా మాత్యులు మరియు జిల్లా ఇన్-చార్జ్ మంత్రివర్యులు విడదల రజిని ప్రారంబించి, వైద్య ఆరోగ్య శాఖ లో పలు అభివృద్ధి కార్యక్రమాలు, పలు ఉద్యోగ నియామకాలు చేయడం జరిగిందని, వైద్య ఆరోగ్య శాఖను సమూల మార్పు చేయడం జరిగిందని తెలియచేశారు. శాసనసభ్యులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు వారు ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించి ఈ ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియచేశారు. అంతేకాకుండా శాసన సభ్యులు తమ నియోజకవర్గంలో సాధ్యమైనన్ని ఆరోగ్య శిబిరాలకు హాజరు అయి ప్రజలందరికి అందుబాటులో ఉంటానని మరియు





అవసరమైన మేరకు ఆరోగ్య సిబ్బందిని మరియు గ్రామంలో గల ఇతర డిపార్ట్మెంట్స్ సిబ్బందిని ఉపయోగించుకుని సక్రమంగా అని అభివృద్ధి పనులు ఈ నియోజకవర్గంలో జరుగుతున్నాయని, ఈ జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యులు ఇతర ఆరోగ్య సిబ్బంది, జివియంసి శానిటేషన్ సిబ్బంది, సచివాలయ వాలంటీర్స్, ఆశా కార్యకర్తలు సహకరించడం వలన ఈ కార్యక్రమం సఫలీకృతం అయిందని కొనియాడారు. జిల్లా కలెక్టర్ డా.మల్లికార్జున, ఐఏఎస్ వారు మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖ ద్వారా పలు అభివృద్ధి కార్యక్రమాలు జిల్లాలో జరిగాయని, పలు పట్టణ ఆరోగ్య కేంద్రాల నూతన భవనాలను నిర్మించడం జరిగిందని మరియు ఈ ఆరోగ్య సేవలను ప్రజలు వినియోగించుకోవాలని తెలియచేశారు. జివియంసి కమీషనర్ సాయికాంత్, ఐఏఎస్ వారు మాట్లాడుతూ మున్సిపల్ సిబ్బంది మరియు ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో ఈ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహించడం జరిగిందని ప్రజలు వినియోగించుకోవాలని తెలియచేశారు. డా.పి.జగదీశ్వర రావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి వారు పాల్గొని అమూల్యమైన సూచనలు చేశారు. ఇవి గ్రామీణ ప్రాంతం ఐన ఆనందపురం ప్రాధమిక ఆరోగ్య కేంద్రం లో గల గండిగుండం, ఆర్.తాళ్లవలస ప్రాధమిక ఆరోగ్య కేంద్రంలో గల దాకమర్రి, రేవిడి ప్రాధమిక ఆరోగ్య కేంద్రం లో గల అనంతవరం, మరియు 19 పట్టణ ఆరోగ్య కేంద్ర సచివాలయాలలో నిర్వహించారు.

గ్రామీణ ప్రాంతం 3 కేంద్రములలో OP సాయంత్రం 06:00 గంటల వరకు 1823 మంది, పట్టణ ప్రాంతంలో 19 సచివాలయాలలో 3319 మందికి మొత్తం 5142 మందికి వైద్య సేవలు అందించడమే కాకుండా ఉచితంగా మందులు కూడా ఇవ్వడం జరిగింది. పైన చూసిన OP లో స్పెషలిస్ట్ సేవలు ఉచితంగా అందించడం జరిగిందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.పి.జగదీశ్వర రావు తెలియచేశారు. ఈ వైద్య శిబిరాల్లో డా.బి.ఉమావతి, జిల్లా నోడల్ అధికారి, జోనల్ కమీషనర్ వారు, బి.నాగేశ్వర రావు, డెమో, వార్డు సభ్యులు, పట్టణ/ప్రాధమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు, జివిఎంసి అధికారులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS .,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.